RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 1 ఆగస్ట్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:55

# పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం సురక్షితమన్న రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నార్తర్న్ రీజనల్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “నాయకులు, పార్టీలు మారవచ్చు కానీ, గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను మేం కొనసాగిస్తాం” అని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను హైదరాబాద్‌కు రప్పించి పెట్టుబడులను ఆకర్షించిన తీరును ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలోనే అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వంటి ప్రాజెక్టులు సాకారమయ్యాయని తద్వారా ఫార్మా ఐటీ రంగాలు మరింత విస్తరించాయని తెలిపారు. తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని, తయారీ రంగంలో చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరాల పరంగా టోక్యో, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నామని ఆయన అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు (శంషాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరు) తెలంగాణకు రానున్నాయని వెల్లడించారు.

రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలివస్తున్నాయని, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు సుమారు 200 కంపెనీలు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. డేటా సెంటర్ల స్థాపన కోసం అమెజాన్ సంస్థ రూ.1 లక్ష కోట్లు, అదానీ గ్రూప్ రూ.35,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలను తీసుకురావడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# గోదావరి వరద ఉద్ధృతి

## ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం
## గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి
## భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

మంత్రి శుక్రవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు.

ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి గారు పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రాజెక్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల



File Photo

ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చినందున మూడవ ప్రమాదహెచ్చరిక జారీ చేశామని, ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చారు. 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు.

# తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ.. మరోసారి గడువు పొడిగింపు

## ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం
## హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే
## రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి




తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది.

ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

# తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దాలి

## ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు అధ్యక్షతన ట్రస్ట్ సమావేశం
## చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష
## ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయం
## అత్యవసర వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశం



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్ ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపట్టాలని సూచించారు.

ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు ప్యాకేజీ రేట్లు, ఆసుపత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి ట్రస్ట్‌కు సూచనలు అందజేయాలి.

అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఉద్యోగులు ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేలా ట్రస్ట్ పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయాలని సిఎస్ సూచించారు.

ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్,హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ జెండగే హనుమంత్ కొండిబా, కార్యదర్శులు శ్రుతి ఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టి.ఎన్.జీ.ఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీ.జీ.ఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస రెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, పీఆర్ టీయూ కు చెందిన దామోదర్ రెడ్డి, తెలంగాణా యూ.టి.ఎఫ్ కు చెందిన చావా రవి, ఎస్ టి యు అధ్యక్షులు సదానంద గౌడ్, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమా దేవి, ఎస్ టి ఎఫ్ అధ్యక్షులు డి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

1 ఆగస్ట్ 2026 శనివారం

# వివాహం వర్సెస్ సహజీవనం!

సహజీవనం అంటే వివాహం చేసుకోకుండా కలిసి జీవించడం లేదా కలిసి ఉండటం. విదేశాల్లో దీన్ని 'కోహాబిటేషన్' అంటారు. స్వీడన్, డెన్మార్క్, నార్వే వంటి దేశాల్లో 70--80శాతం జంటలు వివాహానికి ముందు కలిసి ఉంటున్నాయి. అయితే వీరికి చట్టపరంగా 'రిజిస్టర్డ్ పార్టనర్‌షిప్' అనే ఆప్షన్ ఉంది. దీని ప్రకారం వివాహం లేకుండానే ఆర్థిక, సామాజిక హక్కులు దొరుకుతాయి. ఫ్రాన్స్‌లో సహజీవనం చేసే వారికి 'పాక్స్' అనే చట్టం ఉంది. అమెరికాలో అయితే 50శాతం జంటలు వివాహానికి ముందు కలిసి ఉంటాయి. ఆ దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో 'కామన్ లా మ్యారేజ్' ఉంటుంది. 7--10 ఏళ్లు కలిసి ఉంటే చాలు, వివాహం లేకపోయినా చట్టపరమైన హక్కులు వస్తాయి. అలాగే కెనడాలో వివాహం లేకుండా కలిసి ఉండే జంటలకు 'కామన్ లా పార్టనర్' హోదా ఉంది. పాశ్చాత్య దేశాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువ. చాలా దేశాల్లో వివాహం లేకుండా కలిసి ఉండే జంటలకు చట్టపరమైన హక్కులు ఉన్నాయి. విదేశాల్లోని ఈ సహజీవనం ట్రెండ్ ఇప్పుడు భారతదేశంలోనూ విస్తరిస్తోంది.మన దేశంలో వివాహాన్ని ఒక పవిత్రబంధంగా భావిస్తారు. అది కేవలం ఇద్దరి వ్యక్తుల మధ్య ఒప్పందం కాదు, రెండు కుటుంబాల కలయిక. కుటుంబ వ్యవస్థ భారతీయ సమాజానికి పునాది లాంటిది. అటువంటి వ్యవస్థ పట్ల ఇప్పుడు యువతరంలో అననుకూల భావన నెలకొన్నదంటే అందుకు అనేక కారణాలున్నాయి. కుటుంబ వ్యవస్థకు పునాదులైన 'సహనం, సర్దుకుపోవడం, రాజీపడటం' వంటి భావనలు ప్రస్తుతం అదృశ్యమైపోయాయి. ఎందుకు సహించాలి, ఎందుకు సర్దుకుపోవాలి, ఎందుకు రాజీపడాలి-- అని ఈ తరం ప్రశ్నిస్తున్నది. ఇప్పుడు అబ్బాయిలతో పాటు అమ్మాయిలూ సంపాదిస్తున్నారు. అందువల్ల పెళ్లికి సిద్ధమవుతూనే కొన్ని కండీషన్స్ పెడుతున్నారు. ఆర్థికపరమైన భారం తమ మీద పడకూడదని, స్వేచ్ఛ కావాలని, అత్తమామల అభిప్రాయాలు తమపై రుద్దకూడదని, భార్యాభర్తలు ఇరువురు చెరిసగం పనులు చేసుకోవాల్సిందేనని... ఇలా అనేకం. అరవై శాతం యువత ఆలోచన ఇలాగే ఉంటుంది. వీరు పెళ్లిని రిజెక్ట్ చేయడం లేదు, రీడిఫైన్ చేస్తున్నారు. డేటింగ్ యాప్స్, సోషల్ మీడియా వల్ల 'పర్ఫెక్ట్ పార్టనర్' దొరుకుతాడన్న నమ్మకం కూడా వారిలో బాగా పెరిగింది. కట్నం, కులం కంటే మాటలు కలుస్తాయా, రెస్పెక్ట్ ఇస్తాడా/ ఇస్తుందా అన్నదే ప్రధానం. పార్ట్‌నర్ అంటే బెస్ట్ ఫ్రెండ్ మాత్రమే! పెళ్లైనా సొంత ఫ్రెండ్స్, సొంత హాబీస్, సొంత సెల్‌ఫోన్ ప్రైవసీ ఉండాలి. 'పెళ్లి చేసుకుంటా, కానీ నా లైఫ్ నా ఇష్టం' అన్న ఆలోచనలో నేటి యువతరం ఉన్నది.సహజీవనం చేసే వారికి కోర్టులు కూడా రక్షణగా నిలుస్తున్నాయి. వయోజనులు ఇష్టపడి కలిసి ఉంటే ఖాప్ పంచాయతీలు, పోలీసులు, కుటుంబ సభ్యులు ఎవరూ జోక్యం చేసుకోకూడదు. దీన్ని మీరితే కోర్టు ధిక్కరణ కేసు అవుతుంది. పోలీసులు వేధిస్తే హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయవచ్చు లేదా నేరుగా మేజిస్ట్రేట్ దగ్గర ఫిర్యాదు ఇవ్వవచ్చు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహజీవనంపై కొన్ని నిబంధనలు విధించేందుకు ప్రయత్నిస్తోంది. వాటి ప్రకారం-- సహజీవన బంధంలోకి ప్రవేశించే జంటలు తమ నివాస పరిధిలోని జిల్లా రిజిస్ట్రార్ వద్ద వారి పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఒకవేళ ఆ బంధం ముగిసిపోతే దానిని అధికారికంగా రద్దు చేసుకోవాలి. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే గరిష్ఠంగా మూడు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఇలాంటి మరికొన్ని నిబంధనలతో ఒక ముసాయిదా బిల్లును రాబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. మరికొన్ని రాష్ట్రాల్లో సహజీవన సంబంధాన్ని నోటరీ దగ్గర అఫిడవిట్ రూపంలో రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఇది సహజీవనం చేసే ఆ ఇద్దరి వివరాలు, సంబంధం, ఆస్తి విషయాలు రాసుకున్న అగ్రిమెంట్. కోర్టులో సాక్ష్యంగా పనికొస్తుంది. బ్యాంక్, ఇన్సూరెన్స్, పీఎఫ్‌లో భాగస్వామిని నామినీగా పెట్టుకోవడానికి; ఆస్తి ఉంటే తప్పకుండా విల్లు రాయించుకోవడానికి; పిల్లలు పుడితే విడిపోయిన తర్వాత వారి పెంపకం బాధ్యత ఎవరు తీసుకోవాలన్న నిర్ణయానికి ఈ అగ్రిమెంట్ వీలు కల్పిస్తుంది. ఒక రకంగా వివాహ బంధానికి ఉన్న భరోసానే సహజీవనానికి కూడా న్యాయస్థానం ఇచ్చింది. కాకపోతే వివాహ బంధానికి ఉన్నంత చట్టబద్ధత సహజీవనానికి లేదు.ప్రస్తుతం వివాహ వ్యవస్థకు ఎన్ని ఆటంకాలు వచ్చినా, ప్రత్యామ్నాయంగా ఎన్ని మోడల్స్ వచ్చినా, మన దేశ సంస్కృతికీ, వివాహ వ్యవస్థకూ విడదీయలేని బంధం ఉన్నది. కాలానుగుణంగా కొంత తొట్రుపాటుకు గురైనా ఎప్పటికైనా వివాహ వ్యవస్థే అంతిమంగా నిలిచి గెలుస్తుంది అన్నది సంప్రదాయవాదుల నమ్మకం!

## తెలంగాణ ఉద్యమ కారుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి



హైదరాబాద్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిపెట్టారు. గురువారం అర్ధరాత్రి 12:51 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలియగానే అభిమానులు, కార్యకర్తలు, బంధువులు, శ్రేయోభిలాషులలో తీవ్ర విషాదం నెలకొంది. మరోవైపు నర్సంపేటలో నియోజకవర్గంలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. ఆయన భౌతికకాయాన్ని చూసి కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

## పెద్ది మృతి బీఆర్ఎస్కు తీరని లోటు కేసీఆర్



హైదరాబాద్ పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి నడిచిన ఆప్త మిత్రుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం అంకితభావంతో పనిచేసిన పెద్ది రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు, కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణకు తీరని లోటు కేటీఆర్



హైదరాబాద్ తెలంగాణ ఉద్యమ సహచరుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ప్రజల పక్షాన నిలబడి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం బీఆర్ఎస్కే కాకుండా తెలంగాణ సమాజానికీ తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి కార్యకర్తలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. "జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నా" అంటూ కేటీఆర్ నివాళులర్పించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల సీఎం రేవంత్ తీవ్రగ్భ్రాంతి

హైదరాబాద్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవం తుడిని ప్రార్థించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకుముఖ్యమంత్రిప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.



## భోగాపురంలో రేపు ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ... ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష**
**తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశం**
**థింసా నృత్యంతో ప్రపంచ రికార్డు సృష్టించాలని సూచన**
**ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలకాలని దిశానిర్దేశం**



విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా'ను కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్.. కొత్త రకం డీజిల్‌ను ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్

**ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ వినూత్న తరహా డీజిల్ ఆవిష్కరణ**
**మైనస్ 42 డిగ్రీల చలిలోనూ సమర్థంగా పనిచేసే ఇంధనం**
**స్వదేశీ పరిజ్ఞానంతో సైన్యం, ఆయిల్ కంపెనీల సంయుక్త రూపకల్పన**
**హిమాలయాల్లో సైనిక వాహనాల సమర సన్నద్ధత పెంపు**
**ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగంలో కీలక ముందడుగు**




భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు.

సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్-ఎ× ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం.

ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సమర సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు.

'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కృషి, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక ఇంధనాల తయారీకి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. కేవలం సైనిక అవసరాలకే కాకుండా, తీవ్రమైన చలి ఉండే ప్రాంతాల్లో పౌర రవాణా అవసరాలకు కూడా ఈ డీజిల్ ఎంతగానో దోహదపడనుంది. ఈ కార్యక్రమానికి ముందు, ఆర్మీ చీఫ్ తూర్పు సెక్టార్‌లోని సైనిక ఫార్మేషన్లను రెండు రోజుల పాటు సందర్శించి, అక్కడి భద్రతా సన్నద్ధతను మరియు వరద సహాయక చర్యలను సమీక్షించారు.

# మాసబ్‌ట్యాంక్‌లోని ఫిష్ క్యాంటీన్‌ను సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి

## నాణ్యమైన చేపల ఆహారాన్ని ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం -- మంత్రి

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయాన్ని తొలిసారిగా సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి

మాసబ్‌ట్యాంక్‌లోని ఫిష్ క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వహణ, పరిశుభ్రతపై అధికారులతో సమీక్ష

క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న మెనూ, చేపల వంటకాల గురించి వివరాలు తెలుసుకున్న మంత్రి

నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని ఆదేశం

చేపలు అధిక ప్రోటీన్లు, పోషకాలు కలిగిన ఆహారమని, ప్రజలు చేపల వినియోగాన్ని పెంచుకోవాలని సూచన

ఫిష్ క్యాంటీన్ సేవలను మరింత మంది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం

క్యాంటీన్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆదేశం



రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఙ క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి గారికి మత్స్యశాఖ డైరెక్టర్ శ్రీమతి నిఖిల, అదనపు డైరెక్టర్ శ్రీ మురళీకృష్ణతో పాటు శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం మంత్రి గారు మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ క్యాంటీన్‌ను సందర్శించి, అక్కడి నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యత, వినియోగదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న చేపల వంటకాలు, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేపలు అత్యంత పోషక విలువలు కలిగిన ఆహారమని, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో చేపల వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మరింత మంది ప్రజలకు ఫిష్ క్యాంటీన్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, క్యాంటీన్‌ను మరింత ఆధునికంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

**అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం**

**ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు**

తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు.

అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు.



హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ పర్యాటక విధానం 2025?30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు.

అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు

# అంబేద్కర్ ఆశయాలు జాతీయ సమైక్యతకు మార్గదర్శకాలు

## అంబేద్కర్ జాతీయవాద భావజాలంపై ఏబీవీపీ నిజాం కళాశాల యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా సదస్సు

హైద్రాబాద్ జులై 31 ; అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిజాం కళాశాల యూనిట్ ఆధ్వర్యంలో "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు ఆయన జాతీయవాద భావజాలం" అనే అంశంపై కళాశాల ఆడిటోరియంలో ఘనంగా సదస్సు నిర్వహించారు.




ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు డా. రావుల కృష్ణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తన ప్రసంగంలో డా. రావుల కృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు కేవలం రాజ్యాంగ రచనకే పరిమితం కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం, జాతీయ సమైక్యతకు మార్గదర్శకాలని తెలిపారు.




ఆయన మాట్లాడుతూ, "దేశభక్తి అంటే కేవలం జాతీయ గీతం పాడటం, జెండా ఎగురవేయడం మాత్రమే కాదు. దేశం కోసం ఆలోచించడం, దేశం కోసం పని చేయడం, దేశం కోసం బాధ్యతగా నిలబడడమే నిజమైన దేశభక్తి" అని పేర్కొన్నారు.

అదేవిధంగా, "జాతీయవాదమే సామాజిక న్యాయం -- అదే అంబేద్కర్ ఆశయం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమే నిజమైన జాతీయతకు పునాది" అని ఆయన విద్యార్థులకు వివరించారు. యువత దేశ నిర్మాణంలో చైతన్యవంతమైన పాత్ర పోషించాలని, అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి బలమైన, సమైక్య భారత నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో ఏబీవీపీ గోల్కొండ జిల్లా కన్వీనర్ విక్రమ్ ఆదిత్య,బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మమత,కళాశాల అధ్యక్షులు అంజన్,కళాశాల కార్యదర్శి విష్ణు,రేవతి , సుప్రజ్,సంపత్,రఘునందన్, రాహుల్,మనోజ్,రాంప్రసాద్, శివ,మహేష్,నితిన్, మాన్సింగ్,జరీనా, వైష్ణవి ఇతర కార్యకర్తలు అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో నిజాం కళాశాల విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దత్తాత్రేయ ఆలయ నిర్మాణానికి రూ.25,001 విరాళం

## జన్మదినాన్ని సేవాదినంగా మార్చిన మధు మహేష్




**వేములవాడ, జూలై 31 (ప్రజాబలం ప్రతినిధి):** వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులో మహారాజా ఫంక్షన్ హాల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సంతాన గణపతి, శ్రీ దత్తాత్రేయుడు, సరస్వతి దేవి, కార్తవీర్యార్జునుడు, సాయిబాబా ఆలయాల నిర్మాణానికి మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.25,001 విరాళాన్ని అందజేశారు.

ఈ విరాళాన్ని ఆలయ వ్యవస్థాపకులు ఈశ్వరగారి నరహరి శర్మకు శనివారం అందించినట్లు మధు మహేష్ తెలిపారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఈ విరాళం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఈశ్వరగారి నరహరి శర్మ మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన మధు మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని దాతలు, భక్తులు ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించి ఈ దైవకార్యంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రధాని బందోబస్తు, భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణ

## - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా,

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగష్టు 1న భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును జాతికి అంకితం చేసేందుకు వస్తున్న నేపథ్యంలో బందోబస్తు, భద్రత ఏర్పాట్లను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, జూలై 31న పర్యవేక్షించారు.

రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎయిర్ పోర్ట్ ఆవరణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, టెర్మినల్ బిల్డింగ్, ప్రధాని సభ నిర్వహించే ప్రాంతం, థింసా నృత్యం నిర్వహించే ప్రాంతాలను సందర్శించి, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాని పర్యటనకు దాదాపు 3 వేల సీసీ కెమెరాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, వాటిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ లోని ఎల్.ఈ.డి.స్క్రీన్స్ కు అనుసంధానం చేసినట్లుగా ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ డీజీపీకి తెలిపారు.

సీసీ కెమెరాల ఆధారంగా క్రౌడ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, పార్కింగ్ ప్రాంతాలను, ప్రధాని సభ జరిగే ప్రాంతాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించనున్నట్లుగా అధికారులు డీజీపీకి వివరించారు.అనంతరం, టెర్మినల్ బిల్డింగ్, లోపలి ప్రాంతాలను సందర్శించి, ప్రధాని సభ జరిగే ప్రాంతాలు, థింసా నృత్యం జరిగే ప్రాంతాలకు వెళ్ళే మార్గాలను పరిశీలించారు. జిల్లా పోలీసుశాఖ చేపట్టిన భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కి వివరించారు. బందోబస్తు, భద్రత, ట్రాఫిక్ విధులను పర్యవేక్షించే సీనియర్ పోలీసు అధికారులు తమ క్రింద పని చేసే అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని అధికారులను రాష్ట్ర డీజీపీ ఆదేశించారు.ప్రజలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే మీటింగ్ స్థలంలోనికి అనుమతించాలన్నారు. సభ ముగిసిన తరువాత ప్రజలు సురక్షితంగా తిరిగి తమ ఇండ్లకు చేరుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టాలన్నారు. జాతీయ రహదారి మీదుగా ఎయిర్పోర్ట్ వైపు వాహనాలు వెళ్ళే మార్గంలో వాహనదారులకు సులువుగా అర్థమయ్యే విధంగా పెద్ద సైజులో సైనేజ్లను ఏర్పాటు చేసి, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలాలకు చేర్చాలని అధికారులకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ సూచించారు.రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా వెంట శాంతిభద్రతల అదనపు డీజీ ఎన్.మధుసూదన రెడ్డి, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ ఐజి కి.శ్రీకాంత్, ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, విశాఖపట్నం రేంజ్ ఐజి గోపినాథ్ జట్టీ, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మరియు ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఉన్నారు.

# భోగాపురంపై క్రెడిట్ వార్...

విజయనగరం, జూలై 31, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రెడిట్ వార్ నడుస్తోంది. ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భోగాపురం క్రెడిట్ తమకే దక్కుతందని మాజీ సీఎం జగన్ అంటే.. కూటమికే క్రెడిట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు అంటున్నారు. ఈ ఇద్దరిలో భోగాపురం క్రెడిట్ ఎవరిది?..విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైంది. ఆగస్టు 1న ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో ఉత్తరాంధ్రలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కుతుందనే అంశం తెరపైకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాలని జగన్ అంటుంటే.. కూటమి ప్రభుత్వానికే క్రెడిట్ దక్కుతుందని అధికార పార్టీలు అంటున్నాయి. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చోరీ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. తాను ఏమీ చేయకపోయినా కీర్తి తనకే దక్కాలంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పనులు ఓ కొలిక్కి తీసుకొచ్చామన్నారు.అయితే అసలు ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది తామేనని చంద్రబాబు అంటున్నారు. కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చి భూసేకరణ ప్రారంభించి శంకుస్థాపన చేశామన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 31 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. ఈ ఇద్దరి వాదనలు పక్కన పెడితే.. అసలు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బీజం ఎప్పుడు పడింది?.. 2016లో ప్రతిపాదనల దగ్గర నుంచి 2026 ప్రారంభోత్సవం వరకు ఏ ప్రభుత్వ హయాంలో ఏ పనులు జరిగాయో తెలుసుకుందాం..

2014 నుంచి 2019 వరకు ఏం జరిగింది?

రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో కీలకంగా మారింది. సాగరతీర నగరం పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. అక్కడ ఉన్న విమానాశ్రయం రక్షణ శాఖ ఆధీనంలో ఉంది. ఈ విషయాన్ని గమనించి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.. ఉత్తరాంధ్రలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భావించింది. 2016లో మరో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కొత్తగా ప్లాన్ చేస్తున్న ఎయిర్‌పోర్ట్ విశాఖపట్నానికి సమీపంలో ఉంటే బావుంటుందని భావించారు.. అందుకే భోగాపురంలో నిర్మించాలని ప్రతిపాదించగా కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అదే ఏడాది కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి టెక్నికల్, సైట్ అనుమతులు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు 15,000 ఎకరాల భూమిని సేకరించాలని భావించారు.. కానీ 2,700 ఎకరాలకు తగ్గించి భూసేకరణ ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు చేతులు మీదుగా ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేశారు. 2019 ఏప్రిల్ నెలలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది.

2019-2024 మధ్య ఏం జరిగింది?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణకు సంబంధించి అంశాలపై ఫోకస్ పెట్టింది. కోర్టు వివాదాలు, కేసుల్ని పరిష్కరించింది.. ఇందుకోసం భూసేకరణను 2200 ఎకరాలకు కుదించింది. భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి పునరావాసం కల్పించారు. అనంతరం భోగాపురం విమానాశ్రయం పనులకు సంబంధించి జీఎంఆర్ సంస్థతో కన్సెషన్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన ఎన్వోసీలు సహా మిగిలిన అనుమతుల్ని పొందారు. 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన (రెండోసారి) చేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వేగంగా చేరుకునేలా 77 మీటర్ల వెడల్పుతో, రూ. 6,300 కోట్ల ఖర్చుతో 55 కి.మీ. మేర ఆరు లేన్ల హైవేను కేంద్రం ప్రకటించింది. 2023 నవంబర్‌లో రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

2024-2026 హయాంలో ఏ పనులు చేశారు?

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయం పనులపై ఫోకస్ పెట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రి కావడంతో పనుల్లో వేగం పెరిగింది. ఏటీసీ టవర్, అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ వర్క్స్, సాంకేతిక పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వయంగా అక్కడ పనుల్ని పరిశీలించారు. 2024లో రన్‌వే, ట్యాక్సీవేలు, అప్రాన్ పనులు, టెర్మినల్ బిల్డింగ్ పనులు వేగవంతం చేశారు. ఎయిర్‌పోర్ట్‌లోని ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్గో కాంప్లెక్స్, ఐరన్ స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. 2024లో ఈ విమానాశ్రయానికి కూటమి ప్రభుత్వం మన్యం వీరుడు 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా పేరుపెట్టింది. అలాగే ఎయిర్‌పోర్టుకు జాతీయ రహదారి నుంచి అనుసంధానించే అప్రోచ్ రోడ్ల పనులు మొదలుపెట్టారు. 2025లో టెర్మినల్ లోపల బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, సెక్యూరిటీ స్కానింగ్, ఆటోమేటెడ్ వ్యవస్థలకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అలాగే ఏటీసీ టవర్ నిర్మాణం ముగిసింది.. అక్కడ అవసరమైన రాడార్, కమ్యూనికేషన్ సిగ్నల్ పరికరాలను అమర్చారు. 2025లో మొదటిసారి తేలికపాటి విమానం సాయంతో ట్రయల్ రన్ పూర్తిచేసి.. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు అవసరమైన రోడ్ల పనులు కూడా చేపట్టారు. 2026 జనవరి 4న భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై తొలి వ్యాలిడేషన్ ఫ్లైట్ (ట్రయల్ రన్) విమానం ల్యాండ్ అయ్యింది. అంతేకాదు ఆఉఅం (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి అవసరమైన ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు సేఫ్టీ, ఫైర్, పర్యావరణ అనుమతులు వచ్చాయి. అలాగే ఎయిర్‌పోర్ట్ లోపల ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా ఇంటీరియర్ ఆర్ట్ వర్క్స్ పనులు పూర్తి చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేషనల్ హైవేను కలిపే ముఖ్యమైన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం క్రెడిట్ ఎవరిది అనే చర్చను పక్కన పెడితే.. అటు వైఎస్సార్‌సీపీ, ఇటు కూటమి ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్‌లో కీలకపాత్ర పోషించాయి. 2016లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఎయిర్‌పోర్ట్‌కు బీజం పడింది.

ప్రాజెక్ట్ ఆలోచన, ప్రతిపాదనతోపాటు కేంద్రం అనుమతులు సాధించింది చంద్రబాబు హయాంలోనే. అలాగే పనులను వేగవంతం చేసి, ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది కూడా కూటమి ప్రభుత్వం హయాంలోనే. అయితే జగన్ హయాంలో భూ వివాదాలు, కోర్టు కేసులను పరిష్కరించారు. జీఎంఆర్‌తో ఒప్పందం చేసుకొని భూమిని అప్పగించారు. రన్ వే నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ లాంటి పనులు వైసీపీ హయాంలోనే మొదలయ్యాయి. విజన్, పనులను వేగవంతంగా పూర్తి చేసిన విషయంలో క్రెడిట్ టీడీపీది కాగా.. భూసమస్యల పరిష్కారం, కన్సెషన్ ఒప్పందం విషయంలో క్రెడిట్ వైఎస్సార్‌సీపీకి ఇవ్వొచ్చు. అంటే భోగాపురం క్రెడిట్ ఈ రెండు పార్టీలదీ.

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్

విజయవాడ, జూలై 31, 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుంబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది.మరోవైపు, ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో తీవ్రంగా విరుచుకుపడే నాయకులు మీడియా ముందు రాకపోతే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రాదనేది పక్కా వాస్తవం. జగన్ మోహన్ రెడ్డి సైతం క్షేత్రస్థాయికి వచ్చి నిరసనలకు పిలుపునిస్తున్నా, దూకుడైన నేతల నాయకత్వం లేకపోవడం వల్ల ఆందోళనలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. పేర్ని నాని, అంబటి రాంబాబులు ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ, రాయలసీమ నుంచి రోజా, కృష్ణా జిల్లా నుంచి కొడాలి నాని, వంశీ, జోగి రమేష్ వంటి వారు జతకలిస్తేనే పార్టీ కేడర్‌లో పూర్వ వైభవం, మైలేజ్ లభిస్తాయని వైఎస్సార్సీపీ శ్రేణులు భావిస్తున్నాయి.అయితే, వీళ్లను జగన్ ఎప్పుడు యాక్టివ్ చేస్తారు? లేదా వారే స్వయంగా బయటకు వస్తారా? అనే ప్రశ్నలకు పార్టీ వ్యూహకర్తల నుంచి భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శల వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని భావిస్తున్న జగన్, ప్రస్తుతానికి కొత్త డెసిషన్ తీసుకునే ముందు కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వం విధించే చట్టపరమైన సవాళ్లు , కేసుల తీవ్రత కొంత తగ్గిన తర్వాతే లేదా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి వీరిని మళ్లీ ముందువరుసలోకి తెచ్చేలా వ్యూహం రచిస్తున్నారని సమాచారం. అందుకే వారు వారి వారి నియోజకవర్గాల్లో పెద్దగా పార్టీ వ్యవహారాలను పట్టించుకోకపోయినా .. లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు.వైఎస్సార్సీపీ తిరిగి పుంజుకోవాలంటే కేవలం జగన్ ఓరల్ ప్రసంగాలు సరిపోవు. క్షేత్రస్థాయిలో కౌంటర్ ఇవ్వగలిగే బలమైన గొంతులు మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావడం అత్యంత అవసరం. ఈ నేతలు తమ వ్యక్తిగత, న్యాయపరమైన సవాళ్లను దాటుకుని ధైర్యంగా ముందుకు వస్తే తప్ప వైఎస్సార్సీపీ కేడర్‌లో కోల్పోయిన ఆత్మవిశ్వాసం తిరిగొచ్చే అవకాశం లేదు. మరి దానికి జగన్ ఏం చేయబోతున్నారో ?

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా ?

విజయవాడ, జూలై 31,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ-గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది.మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయ వాడ-గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# పేపర్ మిల్లు ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ విజయం

రాజమండ్రి, జూలై 31, రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ ఘన విజయం సాధించింది. వైసీపీ, టీడీపీ కూడా పోటీ చేసిన ఈ త్రిముఖ పోరులో జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యూనైటెడ్ ఫ్రంట్ 258 ఓట్లతో గెలుపొందింది. వైఎస్సార్ సీపీకి 228 ఓట్లు రాగా, టీడీపీకి చెందిన టీఎన్‌టీయూసీ 220 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలయిన టీడీపీ, జనసేన విడివిడిగా పోటీచేయడం చర్చనీయాంశమైంది.ఓట్ల శాతంలో ఏపీలో మూడో స్థానంలో ఉండే జనసేన పార్టీ ఈసారి సంచలనం సృష్టించింది. కార్మిక సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీని వెనక్కి నెట్టి మరీ ఘన విజయం సాధించింది. క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీ బలోపేతం అవుతుంది అనడానికి ఇది నిదర్శనమంటూ ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ ఘన విజయం సాధించి, సంచలనం సృష్టించింది.రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో త్రిముఖ పోరు జరిగింది. జనసేన ఫ్రంట్, వైసీపీ కూటమి, టీడీపీ మూడు పార్టీలు ఈ ఎన్నికల్లో పోటీచేశాయి. జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యునైటెడ్ ఫ్రంట్ ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి ఘన విజయం సాధించింది. ఈ పోటీల్లో కూటమి పార్టీలు విడివిడిగా పోటీ చేయడం ఆసక్తికరంగా మారింది.ఈ ఎన్నికల్లో జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యునైటెడ్ ఫ్రంట్ 258 ఓట్లతో గెలుపొందింది. వైఎస్సార్ సీపీ కూటమి 228 ఓట్లతో రెండో స్థానంలో ఉండగా, టీడీపీకి చెందిన టీఎన్‌టీయూసీ 220 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ విజయం అనంతరం జనసేన పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. తొలి విజయం సాధించామంటూ ఆనందం వ్యక్తం చేశారు. తాము ఒంటరిగా కూడా పోటీ చేసి విజయం సాధించగలమని నిరూపించామంటూ జనసేన నాయకులు ఆ పార్టీ జెండాలతో సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు.ఈ కార్మిక సంఘాల ఎన్నికల్లో విజేతలు నిలిచిన జనసేన ఫ్రంట్ నాయకులకు రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అభినందనలు తెలిపారు. అయితే, కూటమి పార్టీ నాయకులు ఇలా విడివిడిగా పోటీ చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితో 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించగా.. ఇప్పుడు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఇలా ఎవరికి వారు పోటీ చేయడం ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో.. అందులో కూడా ఇలానే విడివిడిగా పోటీ చేస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రేవంత్ కు గ్రేటర్ కలవరం

హైదరాబాద్, జూలై 31 గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే మంచినీటి సరఫరా కూడా వేసవిలో సక్రమంగా అందకపోవడంతో నగరవాసులు ఒకింత అసంతృప్తితో ఉన్నారంటున్నారు మరొకవైపు హైడ్రా అంశం కూడా కీలకంగా మారింది. హైడ్రా అధికారులు ఆక్రమణలు కూల్చివేయడంతో అనేక మంది తమ నివాసాలను కోల్పోయారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపిస్తున్నారు. మరొకవైపు మూసీ రిజర్వాయర్ ప్రక్షాళన పనులు ప్రారంభిస్తామని చెప్పడం, సర్వేలు చేయడం వంటివి కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటం, కాంగ్రెస్ ఏ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను సాధిస్తుందన్న ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. బీజేపీ హిందుత్వ నినాదంతో వెళుతుండటం, మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సన్నిహిత్వంపై ప్రశ్నిస్తుండటం కూడా కాంగ్రెస్ ను కొంత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కలవరానికి గురి చేస్తున్నాయని చెప్పక తప్పదు.

# ఏళ్లలో 30 మండలి ఖాళీలు

గుంటూరు, జూలై 31, ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం శాసనమండలి నామినేటెడ్ స్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో దాదాపు ఇరవై మందికి పైగా సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడుతుండటం అమరావతి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఖాళీ అయిన రెండు స్థానాల కోసమే క్యూలో నిలబడి అసంతృప్తికి లోనుకావాల్సిన అవసరం లేదని, కాస్త ఓపిక పడితే ఆశావహులందరికీ పదవులు దక్కడం ఖాయమని సమగ్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని 164 స్థానాల బలం ఆధారంగా రాబోయే మూడేళ్లలో మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సీట్లు కూడా ఏకపక్షంగా కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని మొత్తం 58 స్థానాలు ఉన్నాయి. 2026 నుంచి మార్చి 2029 నాటికి సుమారు 30కి పైగా సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో ఎమ్మెల్యే కోటా, స్థానిక సంస్థల కోటా, గవర్నర్ నామినేటెడ్, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఖాతాలో పడిన స్థానాలన్నీ వరుసగా ఖాళీ అవుతూ వస్తున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కనీస బలం కూడా లేకపోవడంతో, త్వరలో ఖాళీ కాబోయే ప్రతి ఒక్క సీటూ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ముఖ్యంగా 2026 నుంచి 2027 చివరి నాటికి గవర్నర్ నామినేటెడ్ కోటాలో 6 సీట్లు, ఎమ్మెల్యే కోటాలో దాదాపు 7 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు స్థానిక సంస్థల కోటాలో కూడా 10 స్థానాల గడువు ముగియనుంది. అప్పటికి స్థానిక ఎన్నికలు అయిపోతాయి. సహజంగానే అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సంపూర్ణ ఆధిక్యంతో ఎమ్మెల్యే కోటాలోని స్థానాలన్నీ కూటమికే దక్కుతాయి. మెజారిటీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపడం లేదా ఖాళీలు ఏర్పడటంతో ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయం సునాయాసంగా మారనుంది. 2029 మార్చి నాటికి ఎమ్మెల్యే కోటాలో మరో 7 స్థానాలు ఖాళీ కానుండటంతో పాటు, పట్టభద్రుల. ఉపాధ్యాయుల స్థానాల గడువు కూడా పూర్తికానుంది.

పట్టభద్రుల స్థానాల్లో ఇప్పటికే కూటమికి విపరీతమైన ఆమోదయోగ్యత ఉందని గత ఫలితాలు నిరూపించాయి. దీనివల్ల నాటి ఎన్నికల నాటికి శాసనమండలిలో వైఎస్ఆర్‌సీపీ ప్రాతినిధ్యం దాదాపు శూన్యానికి చేరుకుని, మండలిలో ఎన్డీయే కూటమికి తిరుగులేని సంపూర్ణ మెజార్టీ లభిస్తుంది. కేవలం శాసనమండలి మాత్రమే కాదు, ఢిల్లీలోని రాజ్యసభ సీట్ల సమీకరణలు కూడా కూటమికి అత్యంత సానుకూలంగా మారాయి. ఎంపీల పదవీకాల ముగింపు క్రమంలో 2028లో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలు నూరు శాతం కూటమి ఖాతాలోనే పడనున్నాయి. కేంద్రంలోనూ ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ-జనసేనలకు ఈ రాజ్యసభ స్థానాలు దక్కడం వల్ల జాతీయ రాజకీయాల్లోనూ కూటమి నేతల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం మరింత పెరగనుంది. ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తే, ప్రస్తుతం గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం టీడీపీ అగ్రనేతలపై ఒత్తిడి తేవడం లేదా నిరాశకు గురికావడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మూడేళ్ల వ్యవధిలో దాదాపు 30కి పైగా ఎమ్మెల్సీ స్థానాలు, 4 రాజ్యసభ స్థానాలు అందుబాటులోకి రానున్నందున.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, సామాజిక సమీకరణల్లో వెనుకబడిన నాయకులు, ఎన్నికల్లో త్యాగాలు చేసిన అభ్యర్థులకు విడతల వారీగా పదవులు అప్పగించేందుకు చంద్రబాబు వద్ద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందని చెబుతున్నారు. పార్టీ శ్రేణులు ఓపిక పడితే ప్రతి అర్హులైన నాయకుడికీ తగిన గుర్తింపు లభించడం ఖాయమని అంటున్నారు.

# భారతికి కిలక బాధ్యతలు



కడప, జూలై 31,వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా, భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు.ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో కూడా ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు.రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు. పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అందువల్ల భారతి పార్టీ కీలక బాధ్యతలు చేపడతారా, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది రాబోయే రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ ప్రచారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# ఇంకా తేలని రాష్ట్రాల పంచాయితీ

## పుష్కర కాలమైన బదిలీ కాని ఆస్తులు

హైదరాబాద్, జూలై 31, రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లైనా ఇంకా రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ భవనాల పంపకాలు పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను ఆంధ్రప్రదేశ్ సర్కా?ర్ ఇంకా తెలంగాణకు అప్పగించలేదు. కొన్ని భవనాలను ఖాళీ చేసినప్పటికీ వాటిని అప్పగించలేదు. మరికొన్ని భవనాల్లో ఏపీ ఉద్యోగులు కొనసాగుతున్నారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ సహా కీలక ఆస్తుల బదిలీ కూడా పెండింగ్‌లోనే ఉంది. ఆస్తుల విభజన, నదీ జలాల పంపకం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు కొనసాగుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పుష్కర కాలం పూర్తి అయిపోయింది. హైదరాబాద్ నగరం ఉమ్మడి రాజధానిగా 10 ఏళ్ల పాటు కొనసాగింది. ఆ గడువు కూడా తీరిపోయి 2 ఏళ్లు గడిచింది. అయితే ఈ 12 ఏళ్లు పూర్తి అయినా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన అంశం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ మధ్య పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ భవనాల బదిలీ ముందుకు సాగడం లేదు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం హైదరాబాద్‌లోని మొత్తం 2,565 ప్రభుత్వ భవనాల్లో 589 భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. మిగిలిన 1,976 భవనాలను తెలంగాణకు అప్పగించారు. అయితే ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత ఈ భవనాలను తెలంగాణకు అప్పగించాలని అప్పుడే తేల్చి చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు.పాటిగడ్డ, బంజారాహిల్స్, కుందన్‌బాగ్, ఎర్రమంజిల్, సైఫాబాద్, మలక్‌పేట్, ఖలాదేరా, మదన్నపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ భవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మొత్తం 589 భవనాల్లో 221 భవనాల్లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా.. మరో 368 భవనాలను వారు ఖాళీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా అప్పగించలేదు.రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు 2024 జూలై 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం అయి చర్చించారు. అనంతరం అధికారులు, మంత్రుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే ఈ మీటింగ్ జరిగి కూడా 2 ఏళ్లు గడిచినా ఆస్తుల పంపకాల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు.లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వంటి కీలక ప్రభుత్వ భవనాల బదిలీ కూడా ఏపీ, తెలంగాణ మధ్య వివాదంగానే కొనసాగు తోంది. ఈ భవనాన్ని తిరిగి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా.. షెడ్యూల్-9, షెడ్యూల్-10 కింద ఆస్తుల విభజనతో పాటు ఇతర పెండింగ్ అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది.ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఉన్న భవనాల్లో మలక్‌పేట్‌లోనే అత్యధికంగా 308 భవనాలు ఉన్నాయి.

పాటిగడ్డలో 95, ఎర్రమంజిల్‌లో 67, కుందన్‌బాగ్‌లో 44, బంజారాహిల్స్‌లో 33, ఖలాదేరాలో13, సైఫాబాద్‌లో 12, పంజాగుట్టలో 9, మదన్నపేటలో 8 భవనాలు ఇప్పటికీఏపీవద్దే ఉన్నాయి. ఆస్తుల విభజనతో పాటు నదీ జలాల పంపకం, ప్రాజెక్టుల అనుమతులు వంటి పలు కీలక అంశాలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రాష్ట్ర విభజనకు సంబంధిం చిన ప్రధాన సమస్యలు ఇప్పటికీ పూర్తిసా ్ధయిలో పరిష్కారంకాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# డిఫెన్స్ లో మోడీ....



న్యూఢిల్లీ, జూలై 31, కేంద్రంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల జెన్ జీ ఆందోళనను ఆసరా చేసుకుని రాహుల్ కేంద్రంపై విరుచుకు పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మ్యాగ్జిమం ప్రెషర్ వ్యూహాన్ని రెడీ చేసుకున్నారు. జెన్-జీ విద్యార్థుల నిరసనల తీవ్రతకు, ప్రతిపక్షాల వరుస ఆందోళనలకు లొంగి కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించారు. ప్రధాని మోదీ హయాంలో కేంద్రం ఇంతటి తీవ్ర ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పరిణామాన్ని తమకు లభించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ద్వయం.. ఇప్పుడు తమ దాడులను నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపైకి మళ్లించారుపార్లమెంట్ లోపల, బయట రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తూ రాజకీయ వేడిని పెంచారు. విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల చర్యలను ప్రస్తావి విద్యార్థుల శరీరంపైకి పెల్లెట్లు, బుల్లెట్లు వేయించింది అమిత్ షానే అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సభలో మాట్లాడేందుకు పూర్తి అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బయటకు వచ్చి విలేకరుల సమావేశం పెట్టి, జెన్-జీ తరాన్ని రెచ్చగొట్టేలా నేరుగా హోంమంత్రినే టార్గెట్ చేయడం ప్రతిపక్షం మార్చుకున్న దూకుడు వైఖరికి నిదర్శనం. సభలో ప్రియాంక గాంధీ సైతం ఇదే తరహా దూకుడును ప్రదర్శిస్తుండటంతో.. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఎటాక్ మోడ్‌లోకి వెళ్లగా, అధికార పక్షం కౌంటర్ ఇచ్చుకోవడానికి కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.మరో వైపు ప్రధాన్‌ను మార్చేసినట్లుగా ప్రధానిని మార్చేస్తామని కాక్రోచ్ పార్టీ ప్రెసిడెంట్ దీప్కే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రధాని మోదీ ఇన్ ఫ్లూయన్సర్‌గా మారాలని మాట్లాడుతున్నారు. వారి వెనుక ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు ఉన్నాయి. ఆ విషయం బహిరంగంగా చెప్పుకోవడం లేదు. బీజేపీకి తెలుసు. కానీ ఇలాంటి వారికి బలం ఇచ్చింది బీజేపీ డిఫెన్సివ్ ధోరణినే. అందుకే భరించక తప్పడం లేదు.దశాబ్దాలుగా ఎలక్షన్ మెషినరీని, పార్లమెంటరీ వ్యూహాలను శాసిస్తున్న బీజేపీ, మోదీ-షా ద్వయం ఈ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు స్వంత శైలిలో కౌంటర్ స్ట్రాటజీని అమలు చేస్తోంది. అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన పెల్లెట్ ప్రయోగం ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్‌లు సభలో తీవ్రంగా నిలదీశారు. రూల్ బుక్ ఆధారంగా స్పీకర్ చేత ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేలా చేయడంలో సఫలమయ్యారు. డిఫెన్సివ్‌గా కనిపిస్తూనే, మరోవైపు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్ వంటి జాతీయ భద్రతా బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుంటూ.. తాము నేషనల్ సెక్యూరిటీ విషయంలో రాజీపడేదే లేదని, ఓటు బ్యాంక్ రాజకీయాలకు లొంగబోమని తమ శ్రేణులకు సంకేతాలు ఇస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులను, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ దేశంలో అశాంతిని రేపుతున్నారని, ఆర్ఎస్ఎస్ , విద్యావ్యవస్థపై బురద జల్లుతున్నారని బీజేపీ మీడియా విభాగాలు విస్తృత ప్రచారం మొదలుపెట్టాయి. కానీ ఇవన్నీ అంతగా ప్రజల్లోకి వెళ్లడం లేదు.అత్యధిక సీట్లతో తిరుగులేని బలంతో ఉన్నప్పటికీ.. జెన్ జీ యువత ఆలోచనలు, వీధి పోరాటాలు , రాహుల్ గాంధీ దూకుడు ఈ సరికొత్త సవాలును తిప్పికొట్టడం బీజేపీకి అంత తేలికైన విషయమేమీ కాదు. ప్రభుత్వం బడ్జెట్, బిల్లుల ఆమోదంపై దృష్టి పెట్టినప్పటికీ.. మీడియా, సోషల్ మీడియా నెరేటివ్ యుద్ధంలో రాహుల్ పెంచుతున్న వేడిని బీజేపీ ఎంతవరకు అదుపు చేయగలుగుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది

# ఒక వైపు రాయలసీమ... మరో వైపు ఉత్తరాంధ్ర...

## అంతు చిక్కని జగన్ వ్యూహం

విజయవాడ జూలై 31, ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం ప్రజాస్వామ్యంలో కొత్తేమీ కాదు. అయితే, ఒకే రాజకీయాధికారం కోసం ఒకే పార్టీ ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో భిన్నమైన, వివాదాస్పదమైన డిమాండ్లను తెరపైకి తెచ్చే వ్యూహాలు అరుదుగా కనిపిస్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం అమలు చేస్తున్నట్లుగా భావిస్తున్న వ్యూహం సరిగ్గా ఈ తరహాకే చెందినది. ఒకవైపు రాయలసీమ అన్యాయం పేరుతో ప్రత్యేక రాష్ట్ర హోదా అనే నినాదాలను సజ్జల రామకృష్ణారెడ్డి వంటి నేతల ద్వారా ప్రోత్సహిస్తూ, మరోవైపు ఉత్తరాంధ్రలో ధర్మాన ప్రసాదరావు వంటి సీనియర్ నేతలతో ప్రత్యేక ఉత్తరాంధ్ర సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రజల వాస్తవ అవసరాలు, వారి ఆలోచనా ధోరణితో సంబంధం లేకుండా కేవలం సొంత మీడియా, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా తమ అభిప్రాయాలను ప్రజలపై రుద్దవచ్చన్న ధీమా ఈ తరహా వ్యూహాలకు మూలధనం. సమాజంలో ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పుడు వాటిని పరిష్కరించే సమగ్ర ప్రణాళికలు రూపొందించడం బాధ్యతాయుతమైన రాజకీయం అవుతుంది. కానీ, ప్రాంతాల మధ్య వైషమ్యాలను రగిల్చడం పొలిటికల్ ప్రాక్సీ డ్రామాను తలపిస్తోంది. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేస్తే తమకు రాజకీయంగా మేలు అనుకుంటున్నారు.ఈ తరహా ప్రాంతీయ విద్వేష వ్యూహం రాజకీయంగా తగలబెట్టేలా మారే ముప్పు ఎక్కువ. 2019-2024 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల ప్రయోగం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పరిపాలనా వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పదబంధం వెనుక అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విభజనలను రగిల్చారనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. ఫలితంగా, ఏ ఒక్క ప్రాంతంలోనూ వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విశ్వసనీయత దక్కకపోగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.ఒకసారి దెబ్బతిన్న వ్యూహాన్నే మళ్లీ కొత్త సీసాలో పాత మద్యంలా మార్చి ప్రయోగించడం పార్టీ భవిష్యత్తుకే ప్రమాదకరం. తమపై తామే పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకోవడం లాంటి ఈ తీరు వల్ల గతంలో వచ్చిన చేదు అనుభవాల నుంచి నాయకత్వం పాఠాలు నేర్చుకోలేదనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. మూడు రాజధానుల అంశంపై ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఇప్పటికే రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లగా, ఇప్పుడు మళ్లీ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ఉద్యమాల పేరుతో ప్రాంతీయ కార్డ్‌ను ఉపయోగిస్తే మిగిలిన కొద్దిపాటి రాజకీయ స్థానం కూడా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఓటర్లు వైరల్ కంటెంట్‌కే పరిమితం కావడం లేదు.. గందరగోళం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వ్యూహాలు సుదీర్ఘకాలంలో వికటిస్తాయి. సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో, ప్రాంతాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించే విధానం వైఎస్సార్‌సీపీని మరింత రాజకీయంగా ఒంటరిని చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# అసెంబ్లీ హామీల్లో సగమే అమలు

హైదరాబాద్, జూలై 31 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుష్కరం పూర్తయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తర్వాత 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ సారథ్యంలో పాలన సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రస్తుతం పాలన సాగుతోంది. అయితే రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రులు, మంత్రులు ఇచ్చిన హామీల అమలు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు సగం హామీలే నెరవేరాయని శాసనసభ హామీల అమలు కమిటీ స్వయంగా వెల్లడించింది.గడిచిన 12 ఏళ్లలో పాలకులు అసెంబ్లీ వేదికగా 2,266 హామీలు ఇచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 1,092 అమలయ్యాయి. 1,174 హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో 750 హామీలు గత ప్రభుత్వ కాలంలో ఇచ్చినవి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు ప్రజలకు ఇచ్చే నమ్మకం. అవి నెరవేరకపోతే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇన్ని సంవత్సరాలు గడిచినా సగం హామీలు పెండింగ్‌లో ఉండటం చట్టసభపై అలసత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.గత ప్రభుత్వ హామీలు ఎక్కువగా మిగిలిపోవడం ఒక వైపు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమీక్షించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో జరిగిన సమావేశంలో పెండింగ్ హామీలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది సానుకూల అడుగు. అయితే కేవలం సమీక్షతో సరిపోదు. సమయ పట్టిక, బాధ్యతలు నిర్ణయించి, పురోగతిని క్రమం తప్పకుండా ప్రజలకు తెలియజేయాలి. హామీలు అమలు కాకపోవడంతో ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరదు. అభివృద్ధి పథకాలు, సేవలు, స్థానిక సమస్యల పరిష్కారం ఆలస్యమవుతాయి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు చట్టబద్ధమైన బాధ్యతగా పరిగణించబడాలి. లేకపోతే రాజకీయ ప్రకటనలు మాత్రమేగా మిగిలిపోతాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. పెండింగ్ హామీలను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించాలి. కొన్ని వెంటనే అమలు చేయగలిగేవి, కొన్ని దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమైనవి. విభాగాల మధ్య సమన్వయం పెంచాలి. అమలు స్థితిని క్రమం తప్పకుండా అసెంబ్లీకి, ప్రజలకు నివేదించాలి. పారదర్శకత పెరిగితే నమ్మకం పునరుద్ధరణకు అవకాశం ఉంటుంది.

వర్షపు నీటిని ఒడిసిపట్టుకోలేమా

వర్షపు నీటిని ఒడిసిపట్టడంలో పాలకుల వైఫల్యం మరొక ఎత్తు. రాజకీయ నాయకులు కేవలం నీటి కేటాయింపులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప వస్తున్న వరదను ఎలా నిల్వ చేయాలో ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రాలపై బురదజల్లే బదులు రాష్ట్రంలోని నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అత్యవసర పరిస్థితి ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది.బంగాళాఖాతంలో అల్పపీడనాలు లేదా వాయుగుండాలు ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం కంటే తెలంగాణలో భారీ వర్షాలు పడటం గమనించదగ్గ విషయం. సముద్రతీరంలో ఉన్న విశాఖపట్నంలో కేవలం ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ, హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని అనేక జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రెండు మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాలు నీట మునిగి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. వర్షాల తీవ్రత కారణంగా హైదరాబాద్ నగరంలో ఐటీ ఉద్యోగులను సాయంత్రం వేళల్లో ఇళ్లకు త్వరగా పంపించివేయాలని పోలీసు కమిషనర్ స్వయంగా విజ్ఞప్తి చేశారు. రాత్రి సమయంలో భారీ వర్షం పడితే మహానగరం మరోసారి నీట మునిగిపోయే ప్రమాదం ఉంది.

ఇది హైదరాబాద్ కీర్తిని తగ్గించడం కాదు, ప్రతి వర్షాకాలంలోనూ పునరావృతమవుతున్న చేదు వాస్తవం అని అందరికీ తెలుసు.గట్టిగా వాన పడిన ప్రతిసారీ నగరాలు, పల్లెలు నీట మునుగుతున్నాయే తప్ప ఆ వరద నీటిని ఎక్కడికి మళ్లించి భద్రపరుచుకోవాలో అర్థం కాని దుస్థితి నెలకొంది. తెలంగాణ వ్యాప్తంగా వేలాది ఎకరాల పంట పొలాలు, రోడ్లు జలమయం అవుతున్నా పాలకులకు ఇంకా నీళ్ల కోసం ఆరాటమే మిగులుతోంది. నీటి చుట్టూ రాజకీయాలు చేస్తూనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని నిందించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారింది. వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రంపై ఆరోపణలు గుప్పించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించవచ్చని నాయకులు భావిస్తున్నారు. కానీ ప్రకృతి ఇస్తున్న సంపదను కాపాడుకోవడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నిరసనలు కొనసాగుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించే బదులు ముంచెత్తుతున్న వరద నీటిని ఎక్కడికక్కడ కాలువలు నిర్మించి రిజర్వాయర్లకు మళ్లించుకునే అద్భుతమైన అవకాశం ఉంది.

హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రధాన జంక్షన్ల వద్ద వరద నీటిని సేకరించేందుకు భూగర్భ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించిన పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించవచ్చు. వర్షాకాలంలో వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటిని ఇలాంటి రిజర్వాయర్లు, స్టోరేజ్ ట్యాంకుల్లోకి మళ్లిస్తే భవిష్యత్తులో సాగునీటి కొరత ఉండదు. ప్రాజెక్టుల నిర్మాణం, కాలువల ఆధునీకరణపై సరైన ప్రణాళిక ఉంటే ప్రతి గొంతుకు నీరు అందుతుంది.

కేవలం రాజకీయ మైలేజ్ కోసం నిత్యం ఆంధ్రాను దోషిగా చూపడం మానేసి సొంత రాష్ట్రంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా పాలకుల ఆలోచన సాగాలి. వృథాగా పోతున్న వరద నీటిని ఒడిసిపట్టే సమర్థవంతమైన ఇంజనీరింగ్ అడుగులు పడిననాడే రాష్ట్రానికి నిజమైన నీటి భద్రత లభిస్తుంది.

# రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...

హైదరాబాద్, జూలై 31 తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది.రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ ఆఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

# రంగనాధ్ కు మద్దతుగా రేవంత్



హైదరాబాద్, జూలై 31 హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఈ ఉదంతం ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది.హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ అంశంలో అంగుళం కూడా వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా రంగనాథ్‌నే అదే పదవిలో కొనసాగించాలనే దిశగా కాంగ్రెస్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారుల నియామకం, బదిలీలు అనేది సంపూర్ణంగా ప్రభుత్వం పరిధిలోని అంశమని, ఇందులో కోర్టు జోక్యం సరికాదనే బలమైన వాదనను వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించి లీగల్ ఆప్షన్లను పరిశీలించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి రాగానే దీనిపై తుది సమీక్ష నిర్వహించి, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కోర్టు ఆదేశాలపై స్టే తెచ్చుకోవడమే కాకుండా, రంగనాథ్ బాధ్యతలను యథాతథంగా కొనసాగించేలా న్యాయపోరాటం చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.రాజకీయ కోణంలో చూస్తే, హైడ్రా అనేది కేవలం ఒక ప్రభుత్వ విభాగానికో లేదా ఆక్రమణల తొలగింపుకో పరిమితమైన అంశం కాదు. ఇది రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌తో నేరుగా ముడిపడి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అత్యంత ఆవేశంగా, పట్టుదలతో ముందుకు తీసుకెళ్లిన ప్రాజెక్ట్ హైడ్రా. ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల కారణంగా వెనకడుగు వేస్తే, అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధంగా మారుతుంది. అధికారుల నియామకంలో కోర్టుల ఆదేశాలకు తలొగ్గితే, భవిష్యత్తులో పరిపాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రా లక్ష్యాలను నిర్భయంగా అమలు చేయడంలో రంగనాథ్ చూపిన చొరవ రేవంత్‌కు బాగా నచ్చింది. ఆయనను తొలగిస్తే పథకం వేగం మందగిస్తుందనేది సర్కార్ భయం.న్యాయస్థానాలు కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతుంటే, ప్రభుత్వం మాత్రం తమ పరిపాలనాధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు చట్టబద్ధత, కోర్టు ధిక్కరణ ఆరోపణలు, మరోవైపు రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పట్టుదల.. ఈ రెండింటి నడుమ హైడ్రా వ్యవహారం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం వినిపించే వాదనలు ఎంతవరకు నిలబడతాయి? కోర్టు రంగనాథ్ నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రేవంత్ రెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లోనూ, అధికారుల నియామక ప్రక్రియల్లోనూ ఒక కొత్త చర్చకు దారితీయడం ఖాయం

# ఆస్పత్రిలో వ్యక్తి జేబులో నగదు చోరీ

హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి జేబులో నుంచి రూ.46,500 నగదు చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకి పారామౌంట్ కాలనీకి చెందిన ఉస్మాన్ (45) ఈ నెల 27న అపోలో ఆస్పత్రికి వెళ్లారు. బిల్లింగ్ కౌంటర్ వద్ద వేచి ఉన్న సమయంలో గుర్తుతెలియని మహిళలు అతని జేబులో ఉన్న రూ.46,500 నగదును చాకచక్యంగా అపహరించారు. విషయం గుర్తించిన బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# పక్కా వ్యూహాలతో టీపీసీసీ

హైదరాబాద్, జూలై 31,తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది.ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డిసిసిలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం.పార్టీ యంత్రాంగం- ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి -మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

# కేటీఆర్ హస్తిన పర్యటనల వెనుక...

హైదరాబాద్, జూలై 31,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరసగా ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇటీవల హస్తిన బాట పట్టడం ఒకింత రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. అధికార పక్షంలో ఉన్న వారు సహజంగా హస్తినకు వెళ్లి కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి చర్చించడం ఎక్కడైనా జరుగుతుంది. కానీ తెలంగాణలో మాత్రం కేటీఆర్ ఇటీవల కాలంలో వరసగా ఢిల్లీకి వెళుతూ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఇదొక రకమైన సవాల్ విసురుతున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ఆదిలాబాద్ లో సీసీఐ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. రెండు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం కూడా చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరోసారి ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కేటీఆర్ కలిశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, ఐటీ విస్తరణ మరియు జాతీయ రాజకీయ వ్యూహాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఆర్ ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సిరిసిల్ల రైల్వే ప్రాజెక్టుతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే పనులపై చర్చించారు. రాష్ట్రంలో కొత్త ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి కేంద్ర పెద్దలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం, జాతీయ స్థాయిలో పార్టీ ఉనికిని చాటడం ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. మొత్తం మీద కేటీఆర్ హస్తిన టూర్లు ఇటు అధికార పార్టీలో కాక రేపుతున్నాయి. కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం సరికొత్త రాజకీయ ఎత్తుగడగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నల్గోండలో కోమటి వర్గానిదే పై చేయి...

నల్గోండ, జూలై 31, తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుల మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ పీఠంపై జరుగుతున్న పోరు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బట్టబయలు చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను పదవి నుంచి తొలగించాలనే ప్రతిపాదన తీవ్ర దుమారానికి దారితీసింది. కోమటిరెడ్డి సోదరులు మొదటి నుంచి ఈయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకోల్ వివాదం తలెత్తడం, స్థానిక కేడర్ మధ్య విభజన స్పష్టంగా కనిపించడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకవైపు అధినేత అండదండలు ఉన్నప్పటికీ, సొంత జిల్లా మంత్రుల ఒత్తిడి కారణంగా ఈ మార్పు వ్యవహారం అత్యంత సున్నితమైన రాజకీయ అంశంగా మారింది. ఈ పరిణామం కేవలం ఒక పదవికి సంబంధించినది కాకుండా, పార్టీలో ఎవరి ఆధిపత్యం చెల్లుబాటు అవుతుందనే దానికి నిదర్శనంగా మారింది. ఒకవేళ పున్నాపై వేటు పడితే, అది సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి ఎదురుదెబ్బగా భావించాల్సి వస్తుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టు నెగ్గితే, అది ప్రత్యర్థి శిబిరానికి స్పష్టమైన రాజకీయ సంకేతాలను పంపుతుంది. ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, మంత్రివర్గంలో చక్రం తిప్పుతున్న బలమైన మంత్రుల ఒత్తిడిని అధిగమించడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ అత్యంత కీలకమైనవే కాబట్టి, ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర స్థాయిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమీకరణాలు కావడం గమనార్హం. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు కావడం పార్టీకి ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే కుల గణనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బీసీ నేతను పదవి నుంచి తప్పించడం తీవ్ర విమర్శలకు దారితీసే ప్రమాదం ఉంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే, ప్రతిపక్షాలకు బలమైన అస్త్రం దొరికినట్లే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. సామాజిక న్యాయం నినాదానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు రాకుండా ఉండేందుకు పార్టీ పెద్దలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్గపోరు తీవ్ర రూపం దాల్చడం, బీసీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ హైకమాండ్ తల పట్టుకుంటోంది. ఒకవైపు మంత్రుల పట్టుదల, మరోవైపు ఎన్నికల సమయాన సామాజిక సమీకరణాలు దెబ్బతింటాయనే ఆందోళన పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు పార్టీకి నష్టం చేకూరుస్తాయని అనుభవజ్ఞులైన నేతలు హెచ్చరిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ అసమ్మతి రాగాలు పెరిగితే అది నష్టాన్ని కలిగిస్తుంది. వివాదాలను సద్దుమణిగిస్తూ, అందరినీ కలుపుకెళ్లే వ్యూహరచన చేయడంలో అధిష్ఠానం విఫలమైతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఈ సంక్లిష్ట పరిస్థితిని పార్టీ పెద్దలు ఎలా చక్కదిద్దుతారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో డీసీసీల మార్పు కత్తిమీద సాములా మారింది. ఒకవైపు సొంత పార్టీ మంత్రుల ఒత్తిడి, మరోవైపు సామాజిక వర్గాల అసంతృప్తి మధ్య అధిష్ఠానం సతమతమవుతోంది. ఈ వివాదానికి త్వరలోనే తెరపడకపోతే, అది రాబోయే ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి, ఐక్యతను సాధించడంలో నాయకత్వం సఫలమవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ భవిష్యత్తును శాసించేదిగా ఉండనుంది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి



భద్రాచలం కొత్తగూడెం భద్రచలం పుణ్యక్షేత్రం దగ్గర గోదావరి నది నీటి మట్టం పెరుగుతోంది. 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేసారు. భద్రాచలం వద్ద దిగువకు 9లక్షల 30వేల క్యూసెక్కుల వరద నీటి విడుదల చేసారు. 48 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎవరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేసారు.

# మాజీ ఎమ్మెల్యే పై లైంగిక వేధింపుల కేసు నమోదు



హైదరాబాద్ బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై లైంగిక వేధింపుల కేసు నమోదయింది. పంజాగుట్ట పీఎస్లో రేగా కాంతారావుపై కేసు నమోదు చేసారు. పెళ్లి పేరుతో లైంగికంగా వేధించాడని యువతి ఫిర్యాదు చేసింది. రియల్ ఎస్టేట్లో పెట్టుబడుల పేరుతో డబ్బులు కూడా తీసుకున్నాడని ఆరోపించింది. తనకు తెలియకుండానే వీడియోలు తీశాడని ఫిర్యాదులో పేర్కొంది. బీఎంఎస్ 69తో పాటు 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసారు.

# మర్పల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి భారీ నుండి అతి భారీ వర్షాలు రాయల్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమ్మద్ గౌసోద్దీన్



**వికారాబాద్ ప్రతినిధి జూలై 31(ప్రజాబలం)**

**వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల ప్రజలువర్షాకాలం వచ్చింది భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి కాబట్టిచిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయల్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు

జాగ్రత్తలు

1. పాత ఇళ్ళు, కూలే స్థితిలో ఉన్న గోడల దగ్గరికివెళ్లవద్దు
2. కరెంట్ స్తంభాలు, తీగలు తడిసి ఉంటే ముట్టుకోవద్దు
3. లోతట్టు ప్రాంతాల్లోనీరు నిల్వ ఉంటే బయటికి వెళ్లవద్దు
4. జ్వరం, దోమల బారి నుండి కాపాడుకోవడానికి శుభ్రత పాటించండి
5. వాహనాలు నడుపుతున్నప్పుడు స్పీడ్ తగ్గించి జాగ్రత్తగా నడపండి
6. గోరువెచ్చని నీళ్లు తాగండిఅందరూ సురక్షితంగా ఉందాం

వర్షాకాల హెచ్చరిక

7.వర్షంలో బయటికి వెళ్లేటప్పుడు జాగ్రత్త!

8.పిల్లల్ని ఒంటరిగా వదలకండి

9.జ్వరం వస్తే వెంటనే డాక్టర్ ని సంప్రదించండి

10.జాగ్రత్తగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం కాబట్టి ప్రతి ఒక్కరు వర్షాకాలం పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని మహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు

# వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని ప్రియురాలి దారుణ హత్య

## సూట్‌కేస్‌లో మృతదేహం పెట్టి ఒడిశా అడవుల్లో పడేసిన కారు డ్రైవర్

విశాఖపట్నం: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందనే నెపంతో ఒక కారు డ్రైవర్ తన ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన ఉదంతం కలకలం రేపింది మృత దేహాన్ని సూట్‌కేస్‌లో





కుక్కి, ఎవరికీ తెలియకుండా పక్క రాష్ట్రమైన ఒడిశాకు తరలించి అడవుల్లో పడేసిన ఘాతుకానికి పాల్పడ్డాడు. పెళ్లి ప్రస్తావన తేవడమే పాపమైంది పోలీసుల కథనం ప్రకారం కంచరపాలెం దుర్గానగర్‌కు చెందిన బొలిశెట్టి సురేష్ కుమార్ (32) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి పెందుర్తికి చెందిన సంధ్య (20) అనే యువతితో పరిచయం ఏర్పడింది అది కాస్తా వివాహేతర శారీరక సంబంధానికి దారితీసింది. అయితే గత నెల 15వ తేదీన సంధ్య తనను పెళ్లి చేసుకోవాలని సురేష్‌ను కోరింది. దీంతో ఆగ్రహానికి గురైన సురేష్ కుమార్ ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు సూట్‌కేస్‌లో మృతదేహం రైలులో ఒడిశాకు రవాణాహత్య అనంతరం నిందితుడు జగదాంబ సెంటర్‌లో ఒక పెద్ద సూట్‌కేస్‌ను కొనుగోలు చేశాడు సంధ్య మృత దేహాన్ని ఆ సూట్‌కేస్‌లో కుక్కాడు. ఆపై రైలు మార్గంలో ఒడిశాలోని రాయగడ (జేకే పూర్) పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ పడేశాడు ఏమీ తెలియ నట్టు మళ్లీ నగరానికి తిరిగి వచ్చాడు. దుర్గంధంతో వెలుగులోకి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా అరెస్ట్ అటవీ ప్రాంతంలో ఉన్న ఆ సూట్‌కేస్ నుంచి తీవ్రమైన దుర్గంధం రావడాన్ని గమనించిన ఒడిశా పోలీసులు రంగంలోకి దిగారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు రైల్వే స్టేషన్లు,పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణం గా పరిశీలించగా సురేష్ కుమార్ గుట్టు రద్దయింది వెంటనే ఒడిశా పోలీసులు విశాఖపట్నం పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన భార్య తో ఎలాంటి గొడవలు లేకుండా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే, పెళ్లి చేసుకోమని ఒత్తిడి తెస్తున్న సంధ్యను హత్య చేసినట్లు సురేష్ పోలీసుల ఎదుట నేరాన్ని అంగీ కరించాడు. దీంతో ఒడిశా పోలీసులు నిందితుడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై రాయగడ కోర్టుకు తరలించారు.

## పామూరు ఉత్సవాలకు వెళ్తుండగా బొలెరో బోల్తా..

## నెల్లూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

## బద్వేల్ వాసులు ఒకరు మృతి, తొమ్మిది మందికి తీవ్ర గాయాలు



బద్వేలు నెల్లూరు జిల్లా జిల్లా పరిధిలో ని దుత్తలూరు మండలం నందిపాడు సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పామూరు లో జరుగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పూల అలంకరణ పనుల కోసం కార్మికులను తీసుకెళ్తున్న బొలెరో వాహనం టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కాశి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం మేరకు, బద్వేల్ ప్రాంతం నుంచి 15 మంది కార్మికులు పామూరులో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో పూల డెకరేషన్ పనుల కోసం బొలెరో వాహనంలో బయలుదేరారు. దుత్తలూరు మండలం నందిపాడు సమీపానికి చేరుకోగానే వాహనం టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో వాహనం పల్టీలు కొట్టి రోడ్డుపక్కకు బోల్తాపడింది. ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి టైరు పేలిపోవడమే కారణమా లేదా ఇతర కారణాలున్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు

# ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,



జగిత్యాల పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ? పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు బి. ఆనందం (ఏఎస్ఐ), ఎమ్.శ్రీనివాస్ (ఏఎస్ఐ), జి.రవి (హెడ్ కానిస్టేబుల్) లను జిల్లా ఎస్పీ గారు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు

# దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి అశ్రు నివాళి



హన్మకొండ జులై31; తెలంగాణ మలి ఉద్యమంలో 2001 నుండి కేసీఆర్ నాయకత్వంలో పనిచేసిన నిఖార్సయిన ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని రామకృష్ణ సేవాసమితి ,అధ్యక్షుడు,కటంగూరి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు.అతను ఒక ప్రజల మనిషి. అతడు తెలంగాణ ఉద్యమ సందర్భంగా భారీ బహిరంగ సభలు నిర్వహించడంలో, మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా కళాజాత బృందాలతో కలిసి ప్రజలను చైతన్యం చేయుటలో తెలంగాణ రీజినల్ టీచర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మేము కలిసి పనిచేశాం. నర్సంపేట ఎమ్మెల్యేగా ప్రజల సంక్షేమం కోసమే పనిచేసిన అమరుడు. అతడి ఆకస్మిక మరణం అతడి కుటుంబానికి, ఆత్మీయులకు తీరని లోటని పేర్కొన్నారు.హనుమకొండ శ్రీరామకృష్ణ సేవా సమితి పక్షాన అతడి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ అతడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

## మై భారత్ పోర్టల్ లో యువత అందరూ సభ్యత్వము తీసుకోవాలి
## జాయింట్ కలెక్టర్ జితేందర్ రెడ్డి



హైద్రాబాద్ జులై 31 : మై భారత్ పోర్టల్ నందు జిల్లాలో నీ యువత అందరూ దీనిలో సభ్యత్వము కావాలని జాయింట్ కలెక్టర్ జితేందర్ రెడ్డి ఓయులుపు నిచ్చారు.

దీనికోసం జిల్లా వ్యాప్తంగా ఒక అడ్వైజరీ కమిటీని నియమించడం జరిగిందని తెలిపారు. విద్యాధికారి యాదయ్య పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో దీనికి విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అందులో భాగంగా మన జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ హైద్రాబాద్ తరుపున . లక్ష్మణ్ నాయక్, సెక్రటరీ హాజరైనారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ మన జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, మరియు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ అయిన శ్రీ మామిడి భీమిరెడ్డి సార్ గారి నీకూడా ఇందులో భాగస్వాములను చేయడం ఆనందకర మన్నారు.అందుకు మన వంతుగా మన జిల్లా లోని బాల భటులను కూడా ఇందులో మెంబర్షిప్ ను ఇప్పియడం మన బాధ్యతగా ముందుకు రావాలనిలక్ష్మణ్ నాయక్, కోరారు.

# భారీ వర్షాలు.. సమష్టి కృషితోనే ప్రాణ, ఆస్తి రక్షణ
## (హెచ్.ప్రతాప్)

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రజల సాధారణ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లుతుండగా, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణనష్టం, ఆస్తి నష్టం తగ్గించేందుకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

ముందుగా వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసించే కుటుంబాలను ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ప్రమాదకర వంతెనలు, ఉప్పొంగుతున్న వాగులు, లోతట్టు రహదారుల వద్ద రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలి. జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బలగాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో మోహరించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.

ప్రతి జిల్లాలో 24 గంటల నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి, అత్యవసర ఫోన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలి. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తెగిపోయిన తీగలు, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను వెంటనే సరిచేయాలి. సురక్షిత తాగునీరు, ఆహార పొట్లాలు, శిశు ఆహారం, పాలు, దుప్పట్లు, తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు తగిన పరిమాణంలో సిద్ధంగా ఉండాలి.

భారీ వర్షాల అనంతరం డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య బృందాలు, మొబైల్ వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అవసరమైన మందులు, సాలైన్, రక్త నిల్వలు సిద్ధంగా ఉంచాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, క్లోరినేషన్, పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలి.

ఇలాంటి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగానికి తోడుగా సేవాభావంతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థల సహకారాన్ని విస్తృతంగా వినియోగించాలి. ఆహార పంపిణీ, తాగునీటి సరఫరా, వైద్య శిబిరాల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తరలింపు, మానసిక పరామర్శ వంటి సేవల్లో వీటి భాగస్వామ్యం సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తుంది.

ప్రతి ఏడాది వరద ముప్పును ఎదుర్కొంటున్న లోతట్టు ప్రాంతాల సమస్యకు తాత్కాలిక చర్యలు మాత్రమే సరిపోవు. అలాంటి ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా సురక్షిత ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించి పునరావాసం కల్పించే దీర్ఘకాలిక విధానాన్ని అమలు చేయాలి. దీంతో ప్రతి వర్షాకాలంలో పునరావృతమయ్యే ప్రాణ, ఆస్తి నష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

వ్యవసాయ పంటలు, పశుసంపద రక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నష్టాలను వేగంగా అంచనా వేసి తగిన సహాయం అందించాలి. ప్రజలు అధికారిక హెచ్చరికలను మాత్రమే విశ్వసించి, వరద నీటిలోకి వెళ్లకుండా, విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి.

ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళిక, సమన్వయపూర్వక చర్యలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం, ప్రజల అప్రమత్తత, శాశ్వత పునరావాస విధానాలతో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. విపత్తు సమయంలో వేగవంతమైన స్పందనే ప్రభుత్వ సామర్థ్యానికి, సమాజ మానవత్వానికి నిజమైన కొలమానం..

## మద్యం తాగి వాహనాలు నడిపితే తీవ్ర పరిణామాలు..
## రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర.?



రేణిగుంట మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ మండలం, గుడ్డంపల్లి తండాకు చెందిన ఎం. అశోక్ నాయక్ (26) అనే యువకుడు మద్యం సేవించి కారు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడటంతో, అతడిపై మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185 కింద కేసు నమోదు (పెట్టీ కేసు నెం. 3393/2026, ఎస్.టి.సి. నెం. 3213/2026) చేసి తిరుపతిలోని ఎఐ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు ముందు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో మాన్య న్యాయస్థానం రూ. 10,000/- జరిమానాతో పాటు భారతీయ నాగరిక సురక్షా సంహిత ( బి ఎన్ ఎస్ ఎస్ ) సెక్షన్ 23 ప్రకారం జూలై 31 నుండి ఆగస్టు 04 వరకు (మొత్తం 04 రోజులు) రేణిగుంట ఆర్‌టీసీ బస్ స్టేషన్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాలు, పరిసర ప్రాంతాలను శుభ్రపరచే సామాజిక సేవ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ సేవా కాలంలో నిందితుడు రేణిగుంట ఎస్హెచ్ఓ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, అప్పగించిన పనిని పూర్తి చేసినట్లు ఫోటోలతో కూడిన నివేదికను ఆగస్టు 5న కోర్టుకు సమర్పిస్తామని, ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ జయచంద్ర స్పష్టం చేశారు.

## ఆగస్ట్ 2 న బర్కత్ పుర రాఘవేంద్ర స్వామి మఠం లో
# శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్రంపారాయణం




హైద్రాబాద్ జులై 31 ;శ్రీ శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులవారి ఆజ్ఞాను సారముగా ఆగస్ట్ 2 న బర్కత్ పుర రాఘవేంద్ర స్వామి మఠం లో శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రంపారాయణం120 మంది భక్తులతో(9 సార్లు) 1008 సార్లు పారాయణం చేయాలి అని సంకల్పము చేయటం జరిగిందని

శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం బర్కత్ పుర మేనేజర్ ఒ విచారణ కర్త అమెగా చింత అనిల్ కుమార్ తెలిపారు.

కార్యక్రమం సమయం

శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం 7.00 AM

సంకల్పం7.30 to 11.30 రకు

12.00 PM

నైవేద్యం, హస్తోదకం & తీర్థ ప్రసాదం

కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ హరి, వాయు గురువుల అనుగ్రహం పొందగలరని ఆయన కోరారు.

# మోదీ,దళారీ,దోపిడి,పాలక వర్గాలకు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమలను నిర్మిద్దాం

## సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు




హైద్రాబాద్ జులై31: మోదీ,దళారీ,దోపిడి,పాలక వర్గాలకు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమలను నిర్మిద్దాం అని సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు.

సిపిఐ(ఎమ్ ఎల్)రామచంద్రన్ పార్టీ జాతీయ కమిటీ సమావేశం ఈ నెల 28,29,తేదీలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ,పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ అధ్యక్షతన నాగోల్ (హైదరాబాద్) నిర్వహించడం జరిగిందని ,పార్టీ అధికార ప్రతినిధి నకిరేకంటి చిట్టిబాబు ప్రకటించారు, ఈ సమావేశం లో పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ యావత్ ప్రపంచ ప్రఖ్యాత నక్సల్బరి ఉద్యమం దేశం తో పాటు విదేశాలను పేదల,కమ్యూనిస్టు ఉద్యమాలను ప్రభావితం చేస్తే, నేడు క్రియ శిల, వి ద్యా ర్థి , యు వ త , నిరుద్యోగం,అవినీతి,దళిత,మైనార్టీ, ఆదివాసి ప్రజలపై దాడులు,దేశ సంపద అంతా ,అదానీ, అంబానీ, చేతిలో పెట్టిన మోదీఁఅమిత్ షా,కరుడు గట్టిన హిందూ వదులు,తీంం, అయోధ్య రామ్ మందిరంలో చెంద చోరీ చేసిన వారినందరినీ విద్యార్థి,యువత,12 ఏళ్ల హిందూ మతోన్మాద పాలనా ప్రభుత్వాలను ఢిల్లీ నాడి రోడ్లో మోకాళ్లపై కూర్చోబెట్టింది క్రియ శిల విద్యార్థి యువత, యువత సాధించిన విజయం చిన్న విషయం కాదని ,ప్రపంచ దేశాలు సైతం నివ్వెర పోయాయని , ఇది స్వతంత్ర భారతంలో సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు ,బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను ,నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందని, ఈ కోడ్స్ అమలైతే 8 గా లకు,బదులుగా 12 గా లు పని చెయ్యవలసి వస్తుందన్నారు,కనీస వేతనాల హక్కు, ఉద్యోగ భద్రత,కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు బలహీన పడతాయని,వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి, గిట్టుబాటు ధర కల్పించాలి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాని మరింత బలోపేతం చెయ్యాలని కోరారు,కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని డిమాండ్ చేశారు,ప్రజా సంక్షేమ పథకాలు ఆయన ఆశ,అంగన్వాడీ,ఐకేపీ, మధ్యన భోజనం, మున్సిపల్, ఔట్ సోర్సింగ్,రంగాల్లో పని చేస్తున్న వర్కర్లకు కనీస వేతనం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు, ఈ దిశగా గ్రామ స్థాయి నుండి, ఢిల్లీ వరకు విప్లవ ,ప్రగతిశీల, సంస్కృతి సంస్థలు,అంబేద్కర్ వదులు,అందరూ పీడిత ప్రజల హక్కుల కోసం ప్రత్యామ్నాయ శక్తులుగా ఏర్పడాలని ,ఆదిశగా రామచంద్రన్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు

## భారీ వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరద ఉద్ధృతి..

విజయవాడ మహారాష్ట్రలోని మహాబలేశ్వర్లో నేడు 220 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో కృష్ణా, కోయనా నదుల్లో వరద ఉద్ధృతి భారీగా పెరిగే అవకాశముంది. రాధానగరి, వారణా డ్యాముల్లు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో, మరో 48 గంటల్లో ఆల్మట్టి డ్యామ్కు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అంచనా. నేడు కూడా భారీ వర్షాలు కొనసాగితే ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశముంది.ప్రస్తుతం నారాయణపూర్ డ్యామ్ నుంచి 1.20 లక్షల క్యూసెక్కులు, భీమా నది నుంచి 60 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. దాంతో వచ్చే వారం రోజుల పాటు శ్రీశైలం జలాశయానికి భారీ వరద ప్రవాహాలు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# 'కాళాంకి భైరవుడు' మూవీ నుంచి 'ఏంటో ఏమో' సాంగ్ రిలీజ్



విభిన్నమైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్ 'కాళాంకి భైరవుడు' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చేతబడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో చోటుచేసుకున్న కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించనుంది. దర్శకుడు హరిహరన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని రూపొందించారు.

గాయత్రీ ప్రొడక్షన్స్, రాచమల్ల బ్రదర్స్ బ్యానర్లపై కె.ఎన్.రావు, డా. రాచమల్ల శ్రీనివాస రావు ఈ చిత్రాన్ని నిర్మించగా, పీ.ఆర్. సంగీతం సమకూర్చారు. ఇందులో రాజశేఖర్ వర్మ ప్రధాన పాత్రలో నటించగా, రితికా చక్రవర్తి, పూజ కిరణ్, భవ్యశ్రీ ఇతర కీలక పాత్రలను పోషించారు. ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు అని తెలిసిందే.

తాజాగా ఈ చిత్రం నుంచి "ఏంటో ఏమో" అనే మెలోడీ పాటను విజయవాడలో ఘనంగా విడుదల చేశారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని లైలా మాల్‌లో ఉన్న ఎజోబీ థియేటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిత్రబృందం హాజరై అభిమానులు, ప్రేక్షకుల సమక్షంలో పాటను ఆవిష్కరించింది. ఈ వేడుకకు మంచి స్పందన లభించగా, చిత్రబృందం సినిమా విశేషాలను పంచుకుంటూ ప్రేక్షకుల అభిమానానికి కృతజ్ఞతలు తెలిపింది.

×అనంతరం కార్యక్రమంలో...×

×ప్రొడ్యూసర్ రాచమల్ల శ్రీనివాస రావు గారు మాట్లాడుతూ..× "అందరికి నమస్కారం, మా సినిమా కాన్సెప్ట్ బ్లాక్ మేజిక్, ఈ సినిమా మీ అందరికి నచ్చుతుంది అని ఆశిస్తున్నాను. థాంక్ యూ".

×దర్శకుడు హరిహరన్ వి మాట్లాడుతూ..× "ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. విజయవాడ అనేది ఒక ఎమోషన్. అందుకే మా సినిమా సాంగ్ లాంచ్‌ను ఇక్కడ నిర్వహిస్తున్నాం.

'కాళాంకి భైరవుడు' సినిమా ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. కాష్మోరా సినిమా ఇక్కడ ఎంతమంది చూశారో తెలియదు.

అయితే ఆ సినిమాలో రాజేంద్ర ప్రసాద్ గారి నటనకు ఎంతటి ప్రశంసలు దక్కాయో, అదే స్థాయిలో మా సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు వస్తుందని నమ్ముతున్నాను. మా తొలి పాట "పద పద" కు మీరు అందించిన ఆదరణలాగే, ఇప్పుడు విడుదలైన 'ఏంటో ఏమో' పాటను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను. ఒక విషయం మాత్రం కచ్చితంగా చెబుతాను. లెనిన్ సినిమాలో 'భారతమ్మ' పాత్రను ప్రేక్షకులు ఎంతకాలం గుర్తుంచుకున్నారో, మా సినిమాలో 'శ్రీదేవి' పాత్రను కూడా అంతే ప్రేమగా గుర్తుంచుకుంటారు. నన్ను నమ్మి ఈ అవకాశాన్ని ఇచ్చిన మా నిర్మాతలకు ప్రత్యేక ధన్యవాదాలు. వారు నాకు తండ్రిలాంటి వారు.

ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను. మిగతా విశేషాలన్నీ ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మీతో పంచుకుంటాం. ధన్యవాదాలు."

×హీరో రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ,× "విజయవాడ అంటే నాకు చాలా ఎమోషన్. నేను ఇక్కడే చదువుకున్నాను. అందుకే ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. సినిమా పరిశ్రమలో నిర్మాతల సపోర్ట్ లేకుండా మంచి సినిమాలు రావు. ఇలాంటి నిర్మాతలు మరిన్ని మంచి చిత్రాలను నిర్మిస్తూ ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, దర్శకుడు హరిహరన్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

దర్శకుడు హరిహరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఈ పేరు రాబోయే రోజుల్లో ఇండస్ట్రీలో మారుమోగుతుందని నాకు గట్టి నమ్మకం ఉంది. ఆయన ఈ సినిమాను ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. నేను సినిమా చూశాను. ఇప్పటివరకు ఎన్నో సినిమాలు చేసినా, ఈ సినిమా నాకు చాలా స్పెషల్. బ్లాక్ మ్యాజిక్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నా పాత్రను ఎంతో కొత్తగా, ప్రత్యేకంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు తొలి బ్లాక్‌బస్టర్ టాక్ విజయవాడ నుంచే వస్తుందనే నమ్మకం నాకు ఉంది. థాంక్యూ!"

×హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ..× "నాకు తెలుగు చాలా బాగా వచ్చు. మీ విలువైన సమయాన్ని కేటాయించి ఇక్కడికి వచ్చి మా సినిమాకు సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మా మొదటి పాటకు మీరు అందించిన ఆదరణలాగే, ఈ కొత్త పాటను కూడా ఆదరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ పాటను కూడా రీల్స్ ద్వారా వైరల్ చేసి మరింత మంది ప్రేక్షకులకు చేరేలా చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మా దర్శకుడు హరి గారు ఈ సినిమాను ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు.

అలాగే ఈ చిత్రానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలతో మీ ముందుకు వస్తాం. చివరిగా... విజయవాడ... వీ లవ్ యూ! లవ్ అస్ బ్యాక్... ప్లీజ్!"

×నటీనటులు :× రాజశేఖర్ వర్మ, రితికా చక్రవర్తి, పూజ కిరణ్, భవ్యశ్రీ, తదితరులు.

# "నేను ప్రేమికుడ్ని" చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేసిన కోదండరామిరెడ్డి



ఆల్మైటి క్రియేషన్స్ బ్యానర్ లో శ్రీ వి చిన్న శ్రీశైలం యాదవ్ సమర్పణలో వడిగేపల్లి కృష్ణ నిర్మాతగా వి రమేష్ యాదవ్, కాకర్లమూడి రామకృష్ణ సహ నిర్మాతలుగా రామ్ భారధరం దర్శకత్వంలో దేవరపల్లి రేవంత్ ఎల్సా ఘోస్ హీరో హీరోయిన్లు గా తెరకెక్కుతున్న చిత్రం నేను ప్రేమికుడ్ని

నేను ప్రేమికుడ్ని చిత్ర ఫస్ట్ లుక్ కార్యక్రమం హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగింది ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నేను ప్రేమికుడ్ని ఫస్ట్ లుక్ విడుదల చేశారు

ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలి అన్నారు. హీరో రేవంత్ దేవరపల్లి మాట్లాడుతూ 'లవ్, హారర్ ఎలిమెంట్స్ తో రాబోతున్న మా సినిమా ఫస్ట్ లుక్ కోదండరామిరెడ్డి గారు విడుదల చెయ్యడం సంతోషంగా ఉంది, త్వరలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, నేను ప్రేమికుడ్ని సినిమా అందరికి నచ్చే ఫ్యామిలీ సినిమా అవుతుంది అన్నారు

ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ ప్రసాద్ ఈదర, ఎడిటర్ నందమూరి హరి, ఆర్ట్ విజయకృష్ణ, ఫైట్స్ అవినాష్, డాన్స్ బండ్ల రామారావు

# ఘనంగా "నిరమ్" మూవీ ట్రైలర్, ఆడియో లాంచ్



ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "నిరమ్". ఈ చిత్రాన్ని కె. స్క్వేర్ సినిమాస్ సమర్పణలో యూనిట్ ఆఫ్ కె స్క్వేర్ వెంచర్స్ బ్యానర్ పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. పి.రాజేష్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "నిరమ్" సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

లిరిసిస్ట్ భారతీబాబు మాట్లాడుతూ – ఈ చిత్రంలో నేను రెండు సాంగ్స్ రాశాను. వనమాలి గారు రెండు సాంగ్స్ రాశారు. డైరెక్టర్ బలరామ్ కృష్ణ గారికి తెలుగు బాగా తెలుసు. ఆయన మాతో మంచి సాంగ్స్ రాయించుకున్నారు. మనిషి రంగులు ఎలా మారుస్తాడు అనే పాయింట్ తో ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా డైరెక్టర్ రూపొందించారు. తెలుగులో ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

డీవోపీ సంటానియో టెర్జియో మాట్లాడుతూ – బలరామ్ కృష్ణ అద్భుతమైన దర్శకుడు. దర్శకుడిగా ఆయనకు తొలి చిత్రమైనా స్క్రీన్ ప్లే, విజువల్ లాంగ్వేజ్ తో ఆకట్టుకుంటారు. ఇదొక మంచి సినిమా. ఈ చిత్రానికి పనిచేయడం సంతోషంగా ఉంది. డీప్ ఎమోషన్స్ తో ఈ సినిమాను తెరకెక్కించాం. ఇమ్మాన్ మ్యూజిక్ మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తుంది. ఆయన మ్యూజిక్ కథలోని ఎమోషన్ ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ముగెన్, ప్రీతి, తాన్యా పర్ ఫార్మెన్స్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు.

సింగర్ ప్రవస్తి మాట్లాడుతూ – ఇమ్మాన్ సార్ నా ఫేవరేట్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన కంపోజిషన్ లో పాట పాడాలనేది నా డ్రీమ్. ఈ చిత్రంతో ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ మూవీ మీ అందరినీ ఎంగేజ్ చేస్తుంది. అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ డి. ఇమ్మాన్ మాట్లాడుతూ – క్రైమ్ ఇన్విస్టిగేటివ్ థ్రిల్లర్స్, క్రైమ్ థ్రిల్లర్స్, హారర్..ఇవి నా ఫేవరేట్ జానర్స్. నేను కెరీర్ లో ఇప్పటిదాకా 120కి పైగా చిత్రాలకు మ్యూజిక్ చేశాను. అయితే నేను కంపోజ్ చేసిన రెండో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ ఇది. ఈ సినిమాలో నాలుగు సాంగ్స్ ఉంటాయి. భారతీబాబు, వనమాలి మంచి సాహిత్యాన్ని అందించారు. "నిరమ్" చిత్రాన్ని థియేటర్స్ లో చూసేందుకు వేచి చూస్తున్నా. అన్నారు.

కో ప్రొడ్యూసర్ పి. రాజేష్ మాట్లాడుతూ – నేను, డైరెక్టర్ బలరామ్ కృష్ణ స్కూల్ ఫ్రెండ్స్. మా కె స్క్వేర్ వెంచర్స్ సంస్థకు ఇది తొలి చిత్రం. మేము ఈ సినిమా నుంచి సినిమా పరిశ్రమలో మా ప్రయాణం కొనసాగించాలని అనుకుంటున్నాం. మేము కొత్త వాళ్లమైనా మ్యూజిక్ డైరెక్టర్ ఇమ్మాన్ గారు వెల్ కమ్ చేశారు. మాతో వర్క్ చేసేందుకు ముందుకొచ్చారు. మా టీమ్ అంతా పూర్తి సహకారం అందించారు. డైరెక్టర్ బలరామ్ ఒక సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ ను మీకు ప్రెజెంట్ చేయబోతున్నారు. అన్నారు.

నటుడు నితిన్ సత్యా మాట్లాడుతూ – నా కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించాను. ఈ సినిమాలో ప్రతినాయక పాత్రలో నటిస్తున్నాను. మా చిత్రానికి మంచి పేరొస్తే ఆ క్రెడిట్ డైరెక్టర్ కు, మ్యూజిక్ డైరెక్టర్ కే ఇవ్వాలి. మా టీమ్ అంతా కలిసి ఒక మంచి సినిమా చేశాం. తమిళంతో పాటు తెలుగులోనూ మా సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

నటి సురేఖా వాణి మాట్లాడుతూ – ఈ చిత్రంలో నాకు చాలా మంచి క్యారెక్టర్ చేసే అవకాశం దక్కింది. నితిన్ సత్యాతో కలిసి నా కాంబినేషన్ సీన్స్ ఉంటాయి. ఆయనతో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ సినిమాను మీరంతా నాకోసమైనా హిట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

డైరెక్టర్ బలరామ్ కృష్ణ మాట్లాడుతూ – నాకు దర్శకుడిగా తొలి చిత్రమిది. ఈ స్క్రిప్ట్ ను ఇమ్మాన్ గారికి, ఇతర టెక్నీషియన్స్ కు ఆర్టిస్టులు ముగెన్, ప్రీతి, తాన్యాకు చెప్పినప్పుడు వాళ్లు స్క్రిప్ట్ చాలా బాగుందని చెప్పడం నాకు కాన్ఫిడెన్స్ పెంచింది. అనేక వెర్షన్స్ స్క్రిప్ట్ రాసి సరి చూసుకుని స్టోరీ బోర్డ్ తో ఈ సినిమా తెరకెక్కించాం. సాంగ్స్ కోసం ఇమ్మాన్ గారు కావాల్సినంత టైమ్ తీసుకుని క్వాలిటీగా మ్యూజిక్ ఇచ్చారు. ఒక టీమ్ వర్క్ గా మేమంతా ఈ సినిమాకు వర్క్ చేశాం. సినిమా సెట్స్ మీదకు వెళ్లేముందే అంతా పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకున్నాం. ప్రీ ప్రొడక్షన్ లోనే బాగా డిస్కషన్స్ చేశాం. అందుకే షూటింగ్ ప్రాసెస్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగింది. మీరు కొత్త వాళ్లను ఎంతోమందిని ఎంకరేజ్ చేస్తుంటారు. మీకు మా మూవీ నచ్చితే మనస్ఫూర్తిగా సపోర్ట్ చేయండి.

హీరోయిన్ తాన్యా హోప్ మాట్లాడుతూ – మా నిరమ్ మూవీ టీమ్ తో కలిసి మీ ముందుకు రావడం సంతోషంగా ఉంది. మా సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. మీరంతా మా సినిమా చూసి ఎంజాయ్ చేయండి. నా క్యారెక్టర్ చాలా సింపుల్ గా ఉంటుంది. ఒక సాధారణ యువతి తనకు తెలియకుండా ఒక పెద్ద సమస్యలో చిక్కుకుపోతే ఎలా ఇబ్బంది పడుతుంది, ఆ సమస్య నుంచి ఎలా బయటపడుతుంది అనేది నా పాత్రలో చూస్తారు. ఇంట్రెస్టింగ్ గా వెళ్లే కథలో నేనూ ఒక భాగంగా కనిపిస్తా. ఈ టీమ్ తో వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది. నేను ఏ సినిమా చేసినా ఆ మూవీ టీమ్ ఎలా ఉంది అని చూస్తాను. అన్నారు.

హీరో ముగెన్ రావ్ మాట్లాడుతూ – మా మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ట్రైలర్ లాగే సినిమా కూడా మీ అందరినీ ఎంగేజ్ చేస్తుంది. తెలుగు ఆడియెన్స్ మా సినిమా చూసి ఆదరించాలని మేమంతా కోరుకుంటున్నా. ఈ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ముందుకు వస్తున్నందుకు హ్యాపీగా ఫీలవుతున్నాం. ఒక డిఫరెంట్ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ గా మా నిరమ్ మూవీ మిమ్మల్ని ఆద్యంతం ఆకట్టుకుంటుంది. అన్నారు,

నటీనటులు – ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్, నితిన్ సత్యా, సురేఖా వాణి, శ్రీజిత రవి, అన్బు మయిల్ సమి, తిరునవుకరసు, గజరాజ్, స్నేహా గుప్త, తదితరులు

# సుధీర్స్ జోకర్" సినిమాలో గాయత్రీ దేవిగా నటి అభిరామి



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "సుధీర్స్ జోకర్". బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అందరి ప్రశంసలు అందుకున్న పరదా లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి., విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ రోజు "సుధీర్స్ జోకర్" మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రముఖ నటి అభిరామి నటిస్తున్నట్లు ప్రకటించారు. "సుధీర్స్ జోకర్" సినిమాలో అభిరామి గాయత్రీ దేవి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా అభిరామి పోషిస్తున్న గాయత్రీ దేవి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'అమ్మకు ఇచ్చిన మాట చిరకాలం మిగిలిపోతుంది..' అంటూ ఈ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ హార్ట్ టచింగ్ గా ఉంది. అభిరామి చేస్తున్న గాయత్రీ దేవి పాత్ర మంచి ఎమోషన్స్ తో ఆకట్టుకోనుంది. ఆమెకు ఈ పాత్ర టైలర్ మేడ్ అనే ఇంప్రెషన్ ఫస్ట్ లుక్ పోస్టర్ తో కలుగుతోంది. అభిరామి స్ట్రాంగ్ పర్ ఫార్మెన్స్ ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చనుంది.ప్రమోషనల్ కంటెంట్ తో "సుధీర్స్ జోకర్" సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన "సుధీర్స్ జోకర్" మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

# ఫీజుల బకాయిల విడుదలకు బీజేవైఎం సంతకాల సేకరణ



**జహీరాబాద్, జూలై 31 ప్రజాబలం ప్రతినిధి:** విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15 వేల కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలల్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వశిష్ఠ డిగ్రీ కళాశాల, జాగృతి డిగ్రీ కళాశాలల్లో అసెంబ్లీ కన్వీనర్ సోమ అనిల్, కో–కన్వీనర్ నరేష్ పాటిల్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణతో పాటు విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, సురేష్ పూరి, టేకూరి వెంకట్, మహేష్, శ్రీకాంత్, సంగారెడ్డి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్ సూచించారు, ఇటీవల రాష్ట్రంలో వర్షాల సమయంలో విద్యుత్ షాకుల వల్ల, ప్రమాదాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు, తెగిపోయిన లేదా కింద పడ్డ విద్యుత్ తీగల వద్దకు, ఎట్టి పరిస్థితుల్లో దగ్గరకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ జంక్షన్ బ్లాక్ ల వద్ద, నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండాలన్నారు, తడి చేతులతో స్విచ్ బోర్డులు ఎలక్ట్రిక్ పరికరాలను తాకకూడదు, పిల్లలను విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, వర్షం పడుతున్న సమయంలో ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు ఎవరైనా చెట్ల కింద నిలబడవద్దని, జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్ అన్నారు, వాహనదారులు రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలన్నారు, ఎవరికైనా ప్రమాదం జరిగితే సహాయక చర్యలు చేపట్టి,100 కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు

# కురుస్తున్న వర్షాలతో రైతులకు ఊరట

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతన్నల ముఖాలలో ఆనందోత్సవాలు వెల్లి విరుస్తున్నాయి, ఇప్పటివరకు వర్షాలు లేక రైతులు వరి నాట్లు వేయలేకపోయారు, వర్షాలు పడాలని బాధతో దేవుడిని వేడుకొని మొక్కులు మొక్కుకున్నారు, ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు రైతన్నల ముఖాలలో సంతోషాలు కనిపిస్తున్నాయి, వానదేవుడు కరుణించడంతో రైతులు తమ పంట పొలాలలో వరి నాట్లు వేయడంలో సన్నద్ధం అవుతున్నారు.



# హోతికే తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ






**జహీరాబాద్, జూలై 31 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతికే గ్రామంలో ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలను జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, తహసీల్దార్ దశరథ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటశాల, ఆహార నిల్వ గది, బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి వాటి నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.

# శాకాంబరి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీ ఊరడమ్మ అమ్మవారు



**జహీరాబాద్, జూలై 31 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడిలో వెలసిన శ్రీ ఊరడమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించారు. ఆషాడ మాసం పురస్కరించుకుని బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం మొదటి రోజు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వంకాయలు, బెండకాయలు, మిరపకాయలు, క్యాబేజీ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, పూలతో ప్రత్యేకంగా చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

శాకాంబరి దేవి అలంకరణ ప్రకృతి సంపద, వ్యవసాయాభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, సమృద్ధికి ప్రతీకగా భావిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు పి.శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సిద్దు రవి, పాండు, ఫవాన్, సుధాకర్, నాగరాజు, విక్రమ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు అంతర్జాతీయ అవకాశాల దిశగా ఐటీడీఆర్ కీలక అడుగు

## ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధులు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 31:** నైపుణ్యమైన భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లను జపాన్‌కు సిద్ధం చేయాలనే లక్ష్యంతో హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని ఐటీడీఆర్ (ఐటీడీఆర్) డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సంస్థ ప్రతినిధులు శుక్రవారం సందర్శించి శిక్షణా విధానాన్ని పరిశీలించారు.సంస్థ సీఈఓ సయూరి మత్సునో, తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్ సూచనల మేరకు డ్రైవింగ్ శిక్షణ విధానం, మౌలిక సదుపాయాలు, శిక్షణ పరికరాలు, నిర్వహణ ప్రమాణాలు, శిక్షణా వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరస్పర సహకారంపై చర్చించారు. ఐటీడీఆర్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా డ్రైవర్లకు శిక్షణ అందించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.ఈ భాగస్వామ్యం కార్యరూపం దాల్చితే తెలంగాణ యువతకు జపాన్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్, మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, ఐటీడీఆర్ ప్రిన్సిపాల్ దొరై మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ఔరంగానగర్‌లో పౌర హక్కుల దినోత్సవం



**జహీరాబాద్, జూలై 31 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఔరంగానగర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరాగ్‌పల్లి ఎస్సై కె. వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి, హాస్టల్ వార్డెన్ బాలరాజ్ పాల్గొని గ్రామస్థులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, చట్టం ముందు అందరూ సమానులేనని వివరించారు. మతం, కులం, వర్గం అనే తేడాలు లేకుండా పరస్పర గౌరవం, సోదరభావంతో జీవించాలని సూచించారు. పౌర హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మరిగించిన లేదా శుభ్రమైన తాగునీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను నివారించాలని సూచించారు. విద్యుత్ తీగలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# వివాదస్పదమయిన సీఐ తన్నుడు

హిందూపురం హిందూపురం సీఐ రాజగోపాల్ నాయుడు వివాదంలో చిక్కుకున్నారు.బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై దురుసు ప్రవర్తన అందోలనకు దారి తీసింది. శివరామకృష్ణను హిందూపురం సీఐ రాజగోపాల్ నాయుడు బూతులు తిడుతూ... బూటుకాలితో తన్నటం సీసీ కెమెరాల్లో రికార్డయింది. హిందూపురం మాతృశ్రీ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేపట్టిన హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై సీఐ విరుచుకపడ్డారు. సీఐ రాజగోపాల్ నాయుడును సస్పెండ్ చేయాలని కోరుతూ పుట్టపర్తి ఎస్పీ కార్యాలయం వద్ద దళిత సంఘాలు నిరసనకు దిగాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి






### వాగులు,వంకలు,కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

### లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు,ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు,శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశు సంవర్ధక,విద్య,మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు,జిల్లాలో నమోదైన వర్షపాతం,రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారి,తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు,పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు,జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు,గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు,గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు,వాగులు,వంకలు,చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు,కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు,అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు,క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు,ప్రజలు,పశు సంపద,పంటలు,ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు,ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు,త్రాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని,జిల్లాలో ప్రజలకు ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు,ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు చేయకుండా, భూగర్భ జలాల లభ్యత, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు,పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి పారుదల,అత్యవసర సేవలకు సంబంధించి ముందస్తు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు,జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ రాత్రికి రాత్రే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి మండలంలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు,ప్రమాదకర చెరువులు, కాలువలు, కాజ్‌వేలు,ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు,జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రెజింతల్ గ్రామంలో శ్మశానవాటికకు ప్రభుత్వ భూమిని కేటాయించాలి...

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సమస్యలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు అందజేశారు,ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణ తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు,అలాగే సదాశివపేట మండలం రెజింతల్ గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. గ్రామంలో ప్రస్తుతం శ్మశానవాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున సర్వే నెం.149లోని ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు,అనంతరం రెవెన్యూ శాఖలో చాలా లాంగ్ పెండింగ్‌లో ఉన్న వివిధ దరఖాస్తులు, భూ సంబంధిత సమస్యల పరిష్కార పురోగతిపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు,ఎమ్మెల్యే వినతులపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ,సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, మధుసూదన్ రెడ్డి, చీల మలన్న, లక్ష్మారెడ్డి, మజీద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## బాల సదన్ లో ఆకస్మిక తనిఖీలు...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం శుక్రవారం నాడు బాల సదన్ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తనికి నిర్వహించటం జరిగినది,ఈ తనికిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంరక్షణను తోడ్పడాలని అన్నారు,అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు,అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తేలిపారు.

వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలి ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు అని అన్నారు.

# గడువులోగా SIR పూర్తి చేయండి

### పెండింగ్ ఫారాలు, మ్యాపింగ్ వేగవంతం చేయాలి -- ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్

### మేడ్చల్ కలెక్టరేట్‌లో సమీక్ష.. అనంతరం తిమ్మాయిపల్లి, దూల్లపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 31:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫారాల పరిశీలన, ఫిర్యాదుల పరిష్కారం, ఓటర్ల మ్యాపింగ్, డిజిటైజేషన్ పనులను మరింత వేగవంతం చేసి లక్ష్యాలను గడువు కంటే ముందుగానే పూర్తిచేయాలని సూచించారు.




శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇ ఆర్ ఓ లు, ఏ ఇ ఆర్ ఓ లు, బి ఎల్ ఓ ల పనితీరును ఆయన సమీక్షించారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో సంతృప్తికరంగా పని జరుగుతున్నప్పటికీ, ఇతర జిల్లాలతో పోలిస్తే కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన రెండు రోజుల గడువును సమర్థంగా వినియోగించుకుని పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు.



పెండింగ్‌లో ఉన్న ఫారాలపై బి ఎల్ ఓ లు, సూపర్‌వైజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిర్యాదు చేసిన ప్రతి ఓటరుతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఇంకా మ్యాపింగ్ పూర్తికాని ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, ముఖ్యంగా నివాసం మార్చుకున్న వారి వివరాలను ధృవీకరించి తుది నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల పనితీరుపై కూడా ఆయన ఆరా తీశారు. హెల్ప్‌డెస్క్‌లకు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ సంఖ్యలో జారీ చేయాల్సిన నోటీసులను సంబంధిత ఓటర్లకు తప్పనిసరిగా అందజేసి వారి స్పందనను నమోదు చేయాలని సూచించారు. వాటిని ఇ ఆర్ ఓ లు క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ప్రైవేట్ భవనాల్లో ఉన్న కేంద్రాలను ప్రభుత్వ భవనాలు లేదా కమ్యూనిటీ హాళ్లకు మార్చాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సుమారు 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మార్పులు చేసే ముందు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతాలతో కూడిన జిల్లా అని తెలిపారు. 2011 జనాభా 24.60 లక్షలు కాగా, 2025 నాటికి అది 48 లక్షలకు చేరిందని వివరించారు. ఇప్పటివరకు సేకరించలేని ఫారాలతో కలిపి సుమారు 85 శాతం పని పూర్తయిందని, మిగిలిన డిజిటైజేషన్‌ను రాబోయే ఒకటి నుంచి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ు×=, మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈసీఐ కార్యదర్శికి వివరించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఇ ఆర్ ఓ లు వెంకట్ రెడ్డి, సంచిత్ గంగ్వార్, పింకేష్ కుమార్, రాధిక గుప్తా, మయాంక్ సింగ్, ఆర్డీవో మాలతి, ఏ ఇ ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

లిఅనంతరం, ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్ మేడ్చల్ నియోజకవర్గంలోని లితిమ్మాయిపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని లిదూల్లపల్లిలి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ు×= ప్రక్రియను పరిశీలించారు. బి ఎల్ ఓ లను వివరాలు అడిగి తెలుసుకుని పనితీరుపై సూచనలు చేశారు.

# హైకోర్టు తీర్పును వక్రీకరిస్తున్నారంటూ భూ యజమానుల ఆరోపణ

**అన్నోజిగూడ భూములపై అసత్య కథనాలపై మండిపడ్డ యజమానులు.**
**1955 నాటి ప్రభుత్వ తప్పును ఎత్తిచూపిన హైకోర్టు.. రికార్డులు సరిచేయాలని ఆదేశం.**
**తప్పుడు ప్రచారం చేసేవారితో బహిరంగ చర్చకు సిద్ధం -- లేఅవుట్లలో పార్కు స్థలాల అమ్మకాల భాగోతం బయటపెడతాం**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జులై 31:** అబద్ధానికి రెక్కలొస్తే ఆకాశమంత ఎగురుతుంది కానీ.. నిజం ఒక్కసారి అడుగు బయటపెడితే ఆ అబద్ధం అడ్రస్ లేకుండా పోతుంది" అన్న చందంగా తయారైంది మేడ్చల్-మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడలోని భూముల వ్యవహారం. గత కొద్ది రోజులుగా కొన్ని పత్రిక సంస్థల్లో, సామాజిక మాధ్యమాలలో అన్నోజిగూడలోని సర్వే నంబర్లు 88, 89, 90, 91, 92లలోని పట్టా భూములను 'ప్రభుత్వ భూములు'గా చిత్రీకరిస్తూ, 'రియల్ మాఫియా అరాచకం' అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం మరియు చట్ట విరుద్ధమని సదరు భూ యజమానులు తీవ్రంగా ఖండించారు. గౌరవ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పును దాచిపెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసలు నిజం ఇదే.. హైకోర్టు తీర్పు సాక్షిగా!

"గోడకు కొట్టిన సున్నంలా" వాస్తవాలు కళ్లముందే కనిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలం, అన్నోజిగూడ గ్రామానికి చెందిన రైతు బాలగోని రాజయ్య (ప్రస్తుతం 85 ఏళ్లు) కు సర్వే నంబర్లు 88 నుండి 92 వరకు ఉన్న పరిధిలో మొత్తం 16.28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇది పూర్వం నుండి వారి యాజమాన్యంలోనే ఉంది. అయితే, 1955లో ప్రభుత్వం నిర్వహించిన పునఃసమీక్ష (రీ-సర్వే) లో అధికారులు తీవ్రమైన పొరపాటు చేశారు. 16.28 ఎకరాలకు బదులుగా కేవలం 11.48 ఎకరాలుగా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు.

అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టు ఆగ్రహం:

ఈ పొరపాటును గమనించిన బాధిత రైతు ఉన్నతాధికారులను ఆశ్రయించగా, నాటి రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఆర్డీవో) మరియు జాయింట్ కలెక్టర్లు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. 1955 సర్వేలో దోషం దొర్లిందని, రైతు భూమి తగ్గడం వాస్తవమేనని నిర్ధారిస్తూ సవరణల కోసం అసిస్టెంట్ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. అయినప్పటికీ, సర్వే ఉ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ఈ సవరణను వాయిదా వేస్తూ వచ్చారు. పైగా, తప్పుగా నమోదైన రికార్డుల ఆధారంగా సర్వే నంబర్ 90లోని 2.20 ఎకరాల భూమి నుండి ఖాళీ చేయాలంటూ రైతుకు నోటీసులు ఇచ్చారు. దీంతో చేసేది లేక బాధిత రైతు హైకోర్టును ఆశ్రయించారు (డబ్ల్యూ. పీ. 9958/2001). ఈ కేసును విచారించిన గౌరవ జస్టిస్ బి. శేషశయన రెడ్డి, ఆర్డీవో మరియు జాయింట్ కలెక్టర్ల నివేదికలను పరిగణనలోకి తీసుకుని, సర్వేలో దోషం ఉందని స్పష్టంగా తేల్చారు. రికార్డులను సరిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని స్పష్టం చేస్తూ.. జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా రెండు నెలల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సర్వే ఉ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. అలాగే, సర్వే దోష సవరణ ప్రక్రియ ముగిసే వరకు సదరు భూమిలో పిటిషనర్ స్వాధీనతకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని అధికారులను కట్టడి చేశారు.

కుట్రపూరిత ప్రచారాలపై హెచ్చరిక:

హైకోర్టు తీర్పు ఇంత స్పష్టంగా ఉంటే, కావాలనే ఆ తీర్పును దాచిపెట్టి, 2006 నాటి సేల్ అగ్రిమెంట్లను తప్పుబడుతూ, రెవెన్యూ రికార్డుల్లో 22(ఎ) నిషేధిత జాబితాలో ఉందంటూ కొన్ని శక్తులు బురదజల్లుతున్నాయి. "పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతూ లోకమంతా చీకటను కున్నట్లు" వీరు ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వ రికార్డులలోని తప్పును సరిదిద్దాలని కోర్టు ఆదేశించిన తర్వాత, ఆ పాత రికార్డులనే పట్టుకుని వేలాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని యజమానులు ఆరోపించారు.

బహిరంగ చర్చకు సిద్ధం -- అసలు భాగోతం బయటపెడతాం!

తమపై, తమ పట్టా భూములపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారితో ఏ వేదిక మీదనైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని భూ యజమానులు సవాల్ విసిరారు. "కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడగొట్టినట్లు".. కష్టపడి భూములు కాపాడుకుంటున్న రైతు కుటుంబాలపై అభాండాలు వేస్తే ఊరుకునేది లేదన్నారు."ఈ చర్చలో భాగంగా, అసలు మోసగాళ్లు ఎవరో తేలుస్తాం. లేఅవుట్లలో ప్రభుత్వ నియమాల ప్రకారం ప్రజల కోసం కేటాయించాల్సిన 'పార్కు స్థలాలను' కూడా అమ్ముకుని, ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న భాగోతాన్ని కూడా బయటపెడతాం. అప్పుడు తెలుస్తుంది రియల్ మాఫియా ఎవరో, అరాచకం ఎవరో" అని వారు ఘాటుగా హెచ్చరించారు.

న్యాయం గెలుస్తుంది:

"ధర్మం వైపే జయం" ఉంటుంది. హైకోర్టు తీర్పును గౌరవించకుండా, అసత్య వార్తలను ప్రచారం చేస్తూ, భూ యజమానుల పరువుకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన క్రిమినల్ మరియు సివిల్ చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకుని, వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి ఘన నివాళులు అర్పించిన మర్పల్లి బి ఆర్ ఎస్ మండల నాయకులు




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జులై 31(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీమండల కార్యాలయంలోనర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ ఉద్యమకారుడు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారి ఆకస్మిక మరణం పట్ల మర్పల్లి మండల బిఆర్ యస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈరోజు మర్పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.




నిరాడంబర జీవనం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, వారి సంక్షేమం కోసం జీవితాంతం సేవ చేసిన ప్రజానాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

ఆయన మరణం తెలంగాణ సమాజానికి, పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి ,మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి పట్లూర్ మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్,యూత్ అధ్యక్షులు మధుకర్ , పి ఏ సి ఎస్ డైరాక్టర్ యాదయ్య, సర్పంచ్ మహేందర్ ,పార్టీ సీనియర్ నాయకులు బట్టు రమేష్ ,అశోక్, రచయ్య మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య గౌడ్ ,టౌన్ పార్టీ అధ్యక్షులు గఫార్ ,మాజీ ఎంపీటీసీ రవి, సుధాకర్ ,నీలి శ్రీకాంత్ ఖాజా షరీఫ్, వెంకటేష్ పవన్ ,సంతోష్ సునీల్ ,నారాయణ ,అంజి ప్రవీణ్ ,శ్రీనివాస్ ,జైహింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## చౌడేశ్వరి దేవి అమ్మవారికి చీరే సారెను సమర్పించిన బీసీ ఇందిరమ్మ...

కొలిమిగుండ్ల జులై 31 నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో శుక్రవారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పర్యటించారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుండి చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వరకు బీసీ ఇందిరమ్మ పెద్ద ఎత్తున మహిళలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బీసీ ఇందిరమ్మ చౌడేశ్వరి దేవి అమ్మవారికి చీరే సారెను సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో రెండో రోజు వైభవంగా వరుణయాగం



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ జూలై -31, జూలై 31 (ప్రజాబలం ప్రతినిధి):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉదయం ఋష్యశృంగ ముని పూజల మహోత్సవంలో భాగంగా ప్రతిష్ఠాపన దేవతా పూజలు, గౌరీ పూజ, విశ్వశాంతి కార్యక్రమాలు, వాస్తు హోమం, నవగ్రహ హోమం, పరివార దేవతా హోమం, సంతత ధారాభిషేకం తదితర వైదిక క్రతువులను ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించారు. అలాగే వరుణ పర్జన్య దీపారాధన, పరిచయ హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ కొనసాగాయి.



జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహిస్తున్న ఈ వరుణయాగ మహోత్సవాల్లో సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋష్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మహోత్సవాల చివరి రోజైన శనివారం ఉదయం మూలమంత్ర హోమం, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించి ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల మధ్య పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం జరిగే పూర్ణాహుతి, హోమాలు, ఇతర కార్యక్రమాల ఏర్పాట్లపై ఆలయ అర్చకులు, వేదపండితులతో సమీక్ష నిర్వహించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పేదల వైద్యుడు డాక్టర్ డి.పి. గౌరీనాథ్‌కు ఘన నివాళి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంత ప్రజలకు సుమారు నాలుగు దశాబ్దాల పాటు విశిష్ట వైద్య సేవలు అందించిన ప్రముఖ వైద్యులు, పేదల వైద్యుడిగా పేరుగాంచిన డాక్టర్ డి.పి. గౌరీనాథ్ అనారోగ్య కారణంగా శుక్రవారం ఉదయం కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని ఆత్మకూరులోని స్వగృహానికి తీసుకువచ్చారు. చివరిసారిగా ఆయనను చూసేందుకు ప్రజలు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. డాక్టర్ గౌరీనాథ్ ప్రజా వైద్యునిగా, పేదల పెన్నిధిగా విశేష గుర్తింపు పొందారు. నిరాడంబర జీవనం, సేవాభావం, మానవత్వంతో కూడిన వైద్యం ఆయన ప్రత్యేకత. నాడి పట్టి వ్యాధిని గుర్తించే నైపుణ్యంతో పాటు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించి వేలాది మంది రోగుల అభిమానాన్ని సంపాదించారు. నిరుపేదలు, గిరిజన తండాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది రోగులకు అభయహస్తంగా నిలిచారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com